SCAN ME

www.vaarthavedhikasurya.com
PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 32 | ఆదివారం, 21 జూన్, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 32 | SUNDAY, JUNE 21, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## 9.44 కోట్ల మంది అన్నదాతలకు.. 18,880 కోట్లు

- పీఎం కిసాన్ 23వ విడత నిధుల విడుదల
- బెంగాల్ నుంచి విడుదల చేసిన ప్రధాని మోడీ

2

# రెండు రోజులు ఢిల్లీలోనే..

## రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించండి




- ఆ వివరాలను వీలైనంత త్వరగా తెలపండి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ లేఖ

హైదరాబాద్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించేందుకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం కిషన్‌రెడ్డికి మరోసారి లేఖ రాశారు. మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించి సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా జోక్యం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 16న రాసిన లేఖనూ తాజా లేఖలో ప్రస్తావించారు. ఈ నెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనకు వస్తున్నానని, ఈ సందర్భంగా రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యంఉందని లేఖలో సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ అంశాలు సత్వరం పరిష్కారం కావాలని అభిలషించారు. అశ్వినీ వైష్ణవ్‌కు మెట్రోకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా వివరిస్తానని, చర్చలకు అవసరమైన.. సంబంధిత ఒప్పందాలు, ఇతర పత్రాల ప్రతులను కూడా వెంట తీసుకువస్తానని తెలిపారు. సమావేశ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుని ఆ వివరాలను వీలైనంత త్వరగా తెలియజేయాలని లేఖలో కిషన్‌రెడ్డిని కోరారు.






# నేడే నీట్ రీ-ఎగ్జామ్

- దేశవ్యాప్తంగా హాజరుకానున్న 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు
- నాగపూర్ విద్యార్థికి అబుదాబి సెంటర్.. సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు
- సవరించి మళ్లీ హాల్ టికెట్ విడుదల చేసిన ఎన్‌టీఏ
- దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్
- హైదరాబాద్‌లో నీట్ విద్యార్థిని ఆత్మహత్య
- తల్లిదండ్రులను మెప్పించలేక పోతున్నానంటూ సూసైడ్ నోట్

న్యూఢిల్లీ, జూన్ 20: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే 'నీట్ యూజీ' రీ- ఎగ్జామ్ ఆదివారం దేశ, విదేశాల్లో అత్యంత కఠినమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జరగనుంది. గతంలో జరిగిన నీట్ పరీక్షపై పేపర్ లీకేజీ ఆరోపణలు రావడంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మళ్లీ ఎగ్జామ్ నిర్వహిస్తోంది. దీనికి దేశ వ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరుకానున్నారు. పేపర్ లీక్ గందరగోళం తర్వాత విద్యార్థులు తమ సొంత ఊర్లకు దగ్గరగా ఉన్న పరీక్షా కేంద్రాలను ఎంచుకోవడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తున్నది. కోటాలోని 92 పరీక్షా కేంద్రాలతో పాటు అన్ని ఎగ్జామ్ సెంటర్ల వద్ద అధికారులు.. సీసీటీవీ నిఘా, సిగ్నల్ జామర్లు, ప్రత్యేక పోలీసు బృందాలతో గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. పరీక్ష రాయబోయే అభ్యర్థుల కోసం ఎన్‌టీఏ స్పష్టమైన గైడ్ లైన్స్ జారీ చేసింది. దీని ప్రకారం..ఎగ్జామ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు (మొత్తం 195 నిమిషాలు) జరుగుతుంది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే ఎగ్జామ్ సెంటర్లలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు మిగతా 2లో..




# హర్మ్యూజ్ మళ్లీ మూత

- శాంతి ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించినందుకే..
- ఇరాన్ ఖతమ్ అల్ అన్బియా మిలిటరీ కమాండ్ ప్రకటన
- జలసంధి తెరిచే ఉంది: అగ్రరాజ్యం అమెరికా ప్రకటన

వాషింగ్టన్/టెహ్రాన్, జూన్ 20: అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఈ ఒప్పందాన్ని ప్రమాదంలో పడేశాయి. ఇజ్రాయెల్ దాడులపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఇరాన్.. హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసేసినట్లు శనివారం ప్రకటించింది. ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఆరోపించింది. ఈ మేరకు ఇరాన్ అత్యున్నత స్థాయి జాయింట్ మిలిటరీ కమాండ్ ఖతమ్ అల్ అన్బియా ప్రకటన విడుదల చేసింది. దక్షిణ లెబనాన్‌పై మిగతా 2లో..

# సింగిల్ విండో చైర్మన్‌గా చెరుపల్లి అంజనేయులు






చండూరు, జూన్ 20 (వార్తా వేదిక సూర్య):

చండూర్ సింగిల్ విండో చైర్మన్‌గా గట్టుప్పల్ గ్రామానికి చెందిన చెరిపెల్లి ఆంజనేయులు ఎన్నికై పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో తమకు చైర్మన్గా అవకాశం వచ్చిందన్నారు. పార్టీ కోసం నిజాయితీగా ఒక నిబద్ధతతో కష్టపడి పని చేసే గట్టుప్పల మండల యువ నాయకుడు చెరుపల్లి ఆంజనేయులు గుర్తింపు ను ఇచ్చిన ఘన త మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికె దక్కిందన్నారు. పార్టీ కోసం ప్రజల కోసం నిస్వార్ధంగా పనిచేసే వ్యక్తులకు గుర్తింపును ఇవ్వడం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మిగతా 2లో..



## బండి భగీరథ్‌కు బెయిల్

- ఇంజనీరింగ్ పరీక్షలు రాసేందుకు అనుమతి
- 4 రోజుల బెయిల్
- 25న తిరిగి చర్లపల్లి జైలుకు రావాలని ఆదేశం

2 లో..



## వివరాలు సరిపోలని ఓటర్లు.. 89.8 లక్షల మంది

- మ్యాపింగ్ అయిన ఓటర్లలో ఇది 37.67%
- వారందరినీ ఎన్నికల సిబ్బంది విచారణ చేస్తారు
- పొంతన లేని వివరాలతో ఎక్కువ ఓటర్లు ఉన్న జిల్లాలు.. మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, నారాయణపేట్, వనపర్తి

2 లో..

# సనాతన జ్ఞాన సంప్రదాయమే.. యోగా

- ఇది జీవన విధానం: గవర్నర్ శివప్రతాప్
- మోదీ కృషి ఫలితమే యోగా డే: కిషన్‌రెడ్డి
- దివ్య ఔషధం: రాంచందర్ రావు
- భారత సంస్కృతిలో భాగం..యోగా: లక్ష్మణ్
- పరేడ్ గ్రౌండ్స్‌లో 'యోగా డే కౌంట్‌డౌన్'

సికింద్రాబాద్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):

వేల సంవత్సరాలుగా మానవాళికి ఆరోగ్యకరమైన జీవనం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక సమతుల్యతకు మార్గం చూపిన భారతదేశ సనాతన జ్ఞాన సంప్రదాయమే యోగా అని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. యోగా అంటే వ్యాయామం కాదని, ఒక జీవన విధానమని పేర్కొన్నారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమన్వయాన్ని నెలకొల్పే మహోన్నత సాధనమని అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో కౌంట్‌డౌన్ యోగా డే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేల మంది విద్యార్థులతోపాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బీజేపీ నేతలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ ప్రధాని మోదీ కృషి మిగతా 2లో..

## యోగా డే వేడుకలకు సర్వం సిద్ధం

- విదేశాల్లోని 2,500 ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- కోల్‌కతాలోని 'రెడ్ రోడ్'లో వేడుకలకు ప్రధాని మోడీ సారథ్యం

2 లో..



## 27 లక్షల మంది విద్యార్థులకు విజయ పాలు

- పాడి రైతుల బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలి
- పాల ఉత్పత్తి, పశువుల సంఖ్యపై నివేదిక ఇవ్వండి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పాడి రైతులను ప్రోత్సహించాలి: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు విజయ డెయిరీ పాలను అందించాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయ డెయిరీని ఆర్థికంగా బలోపేతం చేసినట్లవుతుదని అన్నారు. భట్టి ఆధ్వర్యంలో శనివారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని మొత్తం పాల ఉత్పత్తి, మిగతా 2లో..



www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం 21 జూన్, 2026
సంపుటి: 2 | సంచిక: 32
Follow:

## బండి భగీరథ్‌కు బెయిల్

హైదరాబాద్ , జూన్ 20 (వార్త వేదిక సూర్య):

పోక్సో కేసులో అరెస్టయి చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్‌కు మేడ్చల్ మల్కాజిగిరి న్యాయస్థానం శనివారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేందుకు జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ భగీరథ్ తరపున అతని న్యాయవాదులు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరారు. పిటిషనర్ తరపున వాదనలు విన్న మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి తిరుపతి.. బండి భగీరథ్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, బెయిల్ షరతులను కచ్చితంగా పాటించాలని, జూన్ 25న చర్లపల్లి జైలుకు తిరిగి రావాలని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో అందుకున్న చర్లపల్లి జైలు అధికారులు బండి భగీరథ్‌ను శనివారం రాత్రి విడుదల చేశారు. కాగా, మైనర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలతో బాధిత బాలిక తల్లి చేసిన ఫిర్యాదు మేరకు భగీరథ్‌పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. మే 9వ తేదీన పోక్సో చట్టం కింద నమోదు చేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు బండి భగీరథ్‌ను మే 16న అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నెల రోజులకు పైగా చర్లపల్లి కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్ శనివారం విడుదలయ్యారు.

## సనాతన జ్ఞాన సంప్రదాయమే.. యోగా

(మొదటి పేజీ తరువాయి)

ఫలితంగా ఐక్యరాజ్య సమితి జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించిందన్నారు. గత 12 ఏళ్లుగా వికాస్ బీ – వి సాత్ బీ అనే మంత్రంతో సాంస్కృతిక పునరుజ్జీవంలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నా రు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడు తూ.. యోగాను ప్రపంచానికి పరిచ యం చేసి, అంతర్జాతీయ స్థాయిలో ప్రా చుర్యం కల్పించిన వ్యక్తి ప్రధాని మోదీ అ ని గుర్తుచేశారు. మోదీ చొరవతో ఐక్యరా జ్య సమితి అధికారంగా జూన్ 21వ తేదీ ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. యోగాకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తీసుకొచ్చింది ప్రధాని మోదీనే అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొనియాడారు. యువత రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మానసిక ఒత్తిడికి యోగా ఒక దివ్య ఔషధ వంటిదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అభిప్రా యపడ్డారు. భారతదేశ సంస్కృతి, సంప్ర దాయాల్లో యోగా ఒక భాగమని, యోగా దేను జరుపుకోవడం ప్రతి భారతీయుడికి సంతోషాన్నిస్తుందని ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యా నించారు. శారీరక, మానసిక దృఢత్వానికి యోగా ఎంతో అవసరమని అన్నారు.

## యోగా డే వేడుకలకు సర్వం సిద్ధం

న్యూఢిల్లీ, జూన్ 20: అంతర్జాతీయ యోగా డే వేడుకలకు దేశ, విదేశాల్లో సర్వం సిద్ధమైంది. ఆదివారం(జూన్ 21న) జరగబోయే 12వ 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' ప్రధాన కార్యక్రమానికి పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా ఆతిథ్యం ఇవ్వనుంది. బెంగాల్‌లో బీజేపీ తొలిసారి అధికారం చేపట్టిన నేపథ్యంలో యోగా వేడుకలకు కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆ రాష్ట్రాన్ని ఎంచుకోవడం గమనార్హం. చారిత్రక 'రెడ్ రోడ్డు'లో జరిగే ఈ వేడుకల్లో ప్రధాని మోదీ స్వయంగా పాల్గొని, యోగా ప్రదర్శనలకు నాయకత్వం వహించనున్నారు. అలాగే 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్)' సమన్వయంతో విదేశాల్లోని 210కి పైగా రాయభార కార్యాలయాలు దాదాపు 2,500 ప్రాంతాల్లో ఈసారి యోగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్ (ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా)' అనే థీమ్‌తో వేడుకలు జరుగుతున్నాయి. కోల్‌కతాలోని 'రెడ్‌రోడ్'లో ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రధాన వేడుకల్లో సుమారు 35 వేల మంది ప్రత్యక్ష పాల్గొననున్నట్లు సమాచారం. అలాగే ఆయుష్ మంత్రిత్వశాఖకు చెందిన యోగా సంగమ్ పోర్టల్‌లోని 'కామన్ యోగా ప్రోటోకాల్' ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ సంస్థలు, సంఘాలు ఏకకాలంలో యోగా కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి యోగా చేసేందుకు దేశవ్యాప్తంగా 6 లక్షల సంస్థలు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఆయుషశాఖ పేర్కొంది. భారత సాంస్కృతిక వారసత్వాన్ని యోగా సంప్రదాయంతో ముడిపెడుతూ.. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత పురావస్తు శాఖ సంయుక్తంగా దేశంలోని 100 ప్రముఖ చారిత్రక ప్రదేశాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వీటిలో ప్రధానంగా ఎర్రకోట, హరిద్వార్, కోణార్క్, హంపి, మహాబలిపురం, హైదరాబాద్ వంటి ప్రాంతాలు ఉన్నాయి.

# వివరాలు సరిపోలని ఓటర్లు.. 89.8 లక్షల మంది

- మ్యాపింగ్ అయిన ఓటర్లలో ఇది 37.67 శాతం
- వారందరినీ ఎన్నికల సిబ్బంది విచారణ చేస్తారు
- పొంతన లేని వివరాలతో ఎక్కువ ఓటర్లు ఉన్న జిల్లాలు..
- మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, నారాయణపేట్, వనపర్తి
- అనర్హుల పేర్ల తొలగింపు కోసమే 'సర్' ప్రక్రియ
- అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు చేస్తాం
- ఈ నెల 25 నుంచి 'సర్' ప్రధాన ప్రక్రియ:
- సీఈవో సి.సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):



రాష్ట్రంలో వివరాల్లో పొంతన సరిగా లేని ఓటర్ల సంఖ్య 89,88,175గా ఉందని.. వారందరికీ ఎన్నికల సిబ్బంది నోటీసులు ఇచ్చి విచారణ చేస్తారని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల సిబ్బంది జూలై 31 నుంచి సెప్టెంబరు 28 మధ్య నిర్దేశించిన తేదీన విచారణకు పిలుస్తారని వెల్లడించారు. సదరు ఓటర్ల వద్ద ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల పత్రాల్లో ఏవీ లేకుంటే.. ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఇతర ధ్రువీకరణ పత్రాలను రుజువులుగా పరిగణించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందని వివరించారు. శనివారం బీఆర్‌కే భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. అనర్హులను తొలగించేందుకే ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను ఎన్నికల సంఘం చేపట్టిందని.. అర్హులైన ప్రతి ఓటరు పేరును జాబితాలో నమోదు చేస్తారని తెలిపారు. ఈ నెల 25 నుంచి 'సర్' ప్రధాన ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. వచ్చే నెల 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందించి, వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఓటర్లు తమ గణన పత్రాలను ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చన్నారు. వచ్చే నెల 24వ తేదీలోపు ఫారాలను పూర్తిచేస్తే.. అదే నెల 31న ప్రచురించే ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు లభిస్తుందని స్పష్టం చేశారు.

### మ్యాపింగ్ అయిన ఓటర్లు 70.54 శాతం

జూన్ 20 నాటికి రాష్ట్రంలోని 3.38 కోట్ల ఓటర్లలో 2.38 కోట్ల మంది మ్యాపింగ్ (ప్రాథమిక గుర్తింపు) పూర్తిచేశారు. ఇంకా 99,64,126 మంది ఓటర్ల మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందని ఎన్నికల సంఘం వెల్లడించిన నివేదికలో పేర్కొంది. మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లలో 89,88,175 మంది (37.67 శాతం మంది) వివరాల్లో వివిధ రకాల ధ్రువీకరణ వ్యత్యాసాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. ఆధార్ వివరాలు సరిపోలకపోవడం, పేరు, వయస్సు, లింగం, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాల్లో వ్యత్యాసాలు, పొంతన లేకపోవడం, ఒకే వ్యక్తి పేరుతో రెండు చోట్ల ఓటు ఉండటం, మ్యాపింగ్ సమయంలో డేటా సరిపోలకపోవడం వంటి 11 రకాల సమస్యలు ఉన్నట్టు తేల్చారు.

జిల్లాల వారీగా పరిశీలిస్తే.. మహబూబాబాద్ 94.54 శాతం మ్యాపింగ్‌తో తొలి స్థానంలో ఉంది. జనగాం 93.44శాతం, మెదక్ 89.98శాతం, సిద్దిపేట 87.81శాతం, నిజామాబాద్ 87.49, యాదాద్రి 87.39 శాతంతో పురోగతిలో ఉన్నాయి. అత్యల్ప మ్యాపింగ్ అయిన జిల్లాల్లో.. మేడ్చల్ మల్కాజ్‌గిరి (43.67శాతం) ఉంది. హైదరాబాద్ (46.69శాతం), రంగారెడ్డి (58.68శాతం) ఉన్నాయి.

ఓటర్ల సంఖ్య పరంగా హైదరాబాద్ జిల్లాలో.. 47.36 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 22.11 లక్షల మందికి మ్యాపింగ్ పూర్తయింది. రంగారెడ్డి జిల్లాలో 36.99 లక్షల ఓటర్లకుగాను 21.71 లక్షల మందికి.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 29.79 లక్షల ఓటర్లకుగాను 13 లక్షల మందికి మ్యాపింగ్ పూర్తి చేశారు.

పొంతనలేని ఓటర్లు ఎక్కువగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 65 శాతం ఉండగా.. తర్వాతి స్థానాల్లో రంగారెడ్డి (52.70శాతం), నారాయణపేట (44.16శాతం), వనపర్తి (43.40శాతం) ఉన్నాయి.

# ప్రైవేటు స్కూళ్లు ఎందుకు పెరిగాయ్?

- 90 శాతం ప్రభుత్వ బడులు కూలిపోయే స్థితిలో ఉంటే సీఎం మాటలు విడ్డూరం..
- ఉస్మానియా యూనివర్సిటీకి ప్రకటించిన రూ.1,000 కోట్లు ఏమయ్యాయి..?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్, జూన్ 20 (వార్త వేదిక సూర్య):



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు అంత డిమాండ్ అంటే ప్రైవేటు పాఠశాలలు ఎందుకు పెరుగుతున్నాయంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు.. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టాల్సి వచ్చిందని సీఎం గొప్పగా చెప్పుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేషనలైజేషన్ పేరిట స్కూళ్లను తగ్గించి, మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 90 శాతానికి పైగా ప్రభుత్వ బడులు కూలిపోయే స్థితిలో ఉన్నాయని, విద్యార్థినులకు టాయిలెట్లు, కనీస మౌలిక వసతులు లేవని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రకటించిన రూ.వెయ్యి కోట్లు ఏమయ్యాయని సీఎంను నిలదీశారు. ఓయూలో 'బీ' హాస్టల్ ఇప్పటికే మూతపడగా, 'డీ', 'ఈ' హాస్టళ్లు కూడా కూలిపోయే స్థితికి చేరాయన్నారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల హాస్టళ్లను తక్షణమే పునర్నిర్మించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. తమ హక్కుల కోసం టీచర్లు, ప్రొఫెసర్లు మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని.. అయితే, నిర్వాసితులకు పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో బొగ్గు కుంభకోణాన్ని కప్పిపుచ్చుకునేందుకే సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి టార్గెట్ చేసి ఆరోపణలు గుప్పిస్తున్నారన్నారు. 'సింగరేణిలో 45 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు కుంభకోణాన్ని దాచిపెట్టడంతో పాటు ఈ అవినీతిపై నిజాలు బయటకు రాకుండా అణిచివేయడానికే సీఎం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. తప్పు చేయనప్పుడు బీజేపీ నిజ నిర్ధారణ కమిటీని ఎందుకు అడ్డుకున్నారు?' అని నిలదీశారు. ఈ బొగ్గు దొంగతనం వెనుక ఉన్న అసలు దొంగలెవరో సమాధానం చెప్పాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కాగా, పారిశ్రామికవేత్త ఫణికుమార్ రాంచందర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

# నేడే నీట్ రీ-ఎగ్జామ్

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షా కేంద్రాల గేట్లు పూర్తిగా మూసివేస్తారు. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను కేంద్రం లోపలికి రానివ్వరు. ఈసారి రఫ్ వర్క్ చేసుకునేందుకు ప్రశ్నాపత్రంలో గతంలో కంటే అదనంగా రెండు పేజీలు కలిపి మొత్తం నాలుగు పేజీలను ఇస్తున్నారు. అభ్యర్థులు పరీక్షకు వచ్చేటప్పుడు రీ–ఎగ్జామ్ కోసం కొత్తగా జారీ చేసిన అడ్మిట్ కార్డ్ కలర్ ప్రింట్‌అవుట్‌ను మాత్రమే తీసుకురా వాలి. పాత హాల్ టికెట్లను అనుమతించరు. దాంతో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ లేదా పాస్‌పోర్ట్ వంటివి) అసలైనది చూపించాలి. మొబైల్‌లోని డిజిటల్ కాపీలను అంగీకరించరు. దరఖాస్తు సమయంలో వాడిన రెండు అదనపు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను కూడా అభ్యర్థులు తమ వెంట ఉంచుకోవాలి. పరీక్షా కేంద్రాల వద్ద కఠినమైన దుస్తుల నియమావళి (డ్రెస్ కోడ్) అమలులో ఉంటుంది. విద్యార్థులు లేత రంగు గల హాఫ్–స్లీవ్ షర్టులు లేదా టీ–షర్టులు, సాధారణ ప్యాంట్లు మాత్రమే ధరించాలి. పాదరక్షలుగా కేవలం సాధారణ స్లిప్పర్లు లేదా తక్కువ హీల్ ఉన్న శాండల్స్ మాత్రమే వేసుకోవాలి. బూట్లు, సాక్స్, ఫుల్–స్లీవ్ దుస్తులు, పెద్ద బటన్లు లేదా భారీ ఎంబ్రాయిడరీ ఉన్న దుస్తులు పూర్తిగా నిషిద్ధం. ఉంగరాలు, గొలుసులు, చెవి పోగులు వంటి ఎలాంటి నగలను ధరించకూడదు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, వాలెట్లు, బెల్టులు, ఎలాంటి కాగితాలను లోపలికి అనుమతించరు. హిజాబ్ లేదా టర్బన్ (తలపాగా) వంటి మతపరమైన దుస్తులు ధరించే వారు సమగ్ర తనిఖీల కోసం పరీక్షా కేంద్రానికి చాలా ముందే చేరుకోవాలని అధికారులు సూచించారు. మరో వైపు, పరీక్షకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే నకిలీ పేపర్ లీక్ పుకార్లు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోచింగ్ సెంటర్లకు, విద్యార్థులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### నాగపూర్ విద్యార్థికి అబుదాబి సెంటర్

నీట్ పరీక్ష రాయనున్న మహారాష్ట్రలోని నాగపూర్‌నకు చెందిన ఓ విద్యార్థికి యూఈఏలోని అబుదాబిలో పరీక్షకేంద్రాన్ని కేటాయించటం కలకలం రేపింది. అబ్దుల్లా తాలిబ్ అనే విద్యార్థి పరీక్షకేంద్రం ఎంపికల్లో నాగపూర్, వార్ధా, బండారా నగరాల పేర్లను తన దరఖాస్తులో పేర్కొన్నాడు. అడ్మిట్‌కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు.. ఈ మూడింటిలో ఏదీ కాకుండా అబుదాబిలోని ఓ పరీక్షకేంద్రాన్ని కేటాయించటం చూసి దిగ్భ్రాంతి చెందాడు. దీనిపై అబ్దుల్లా తండ్రి డాక్టర్ మహమ్మద్ తాలిబ్.. పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దృష్టికి తీసుకువెళ్లారు. సాంకేతిక తప్పిదంతో ఈ పొరపాటు జరిగిందని ఎన్‌టీఏ అధికారులు అంగీకరించారు. తర్వాత నాగపూర్‌లోనే ఒక కేంద్రాన్ని విద్యార్థికి కేటాయిస్తూ మళ్లీ హాల్ టికెట్ విడుదల చేశారు. అయితే, ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు ఎన్‌టీఏ పనితీరుపై మరోసారి విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందిస్తూ.. మన విద్యార్థుల భవిష్యత్తుతో జూదం ఆడటం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశంలో విద్యావ్యవస్థ ధ్వంసమైపోయిందని, ఇది ఒక తరం విద్యార్థుల డబ్బులు, సమయం, మానసిక ప్రశాంతతను దోపిడీ చేయటమేనంటూ నిప్పులు చెరిగారు. మరోవైపు, నీట్ విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన జతిన్ కుమార్ అనే విద్యార్థి ఇంట్లో తన గదిలో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు.

### దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్

ఆదివారం నీట్ రీ ఎగ్జామ్ నేపథ్యంలో ఎన్‌టీఏ శనివారం దేశవ్యాప్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించింది. దేశవిదేశాల్లో నిర్వహించే ఈ పరీక్షకు 22.79 లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. గత నెలలో నిర్వహించిన నీట్ పరీక్ష.. ప్రశ్నపత్రాల లీకేజీతో రద్దయిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వంపై, ఎన్‌టీఏపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమైన విషయం తెలిసిందే. దీంతో ఈసారి రీఎగ్జామ్‌కు గతంలో ఎన్నడూ లేని 2లక్షల మందికిపైగా సిబ్బంది భద్రతా విధుల్లో పాలుపంచుకుంటున్నారు.



## సింగిల్ విండో చైర్మన్‌గా చెరుపల్లి అంజనేయులు

(మొదటి పేజీ తరువాయి)

గారు మరొక్కసారి నిరూపించారన్నారు నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవ చేస్తానని చెప్పారు ఈ బ్యాంకు అభివృద్ధి మరింత ముందుకు తీసుకెళ్తారని ఆయన తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సంఘం డైరెక్టర్లకు చండూరు మున్సిపాలిటీ చైర్మన్ కోడి శ్రీనివాసులు, ఎఫ్ ఎస్ సి ఎస్ మాజీ చైర్ పర్సన్ మున్సిపల్ కౌన్సిలర్ కోడి సుష్మ వెంకన్న మండల పార్టీ అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పట్టణ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ గారికి డిసిసి ఉపాధ్యక్షులు దండు యాదగిరి రెడ్డి, గట్టుప్పల మండల పార్టీ అధ్యక్షులు సర్పంచ్ నామని జగన్నాథం లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## హర్మూజ్ మళ్లీ మూత

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా మొదటి చర్యగా హోర్ముజ్ జలసంధిని మూసేశామని, దాడులు అలాగే కొనసాగితే మరిన్ని ప్రతీకార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయితే, జలసంధి తెరిచే ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రకటించారు. హోర్ముజ్‌లో నౌకలు వెళ్తున్నాయని, దానిని మూసివేసినట్లు ఎలాంటి ఆధారాలు లేవని శనివారం ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) బలహీనపర్చేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోందని అమెరికా నిఘా వర్గాలు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హెచ్చరించాయి. ఇరాన్‌కు కోపం తెప్పించి డీల్ నుంచి తప్పుకొనేలా చేసేందుకే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతోందని పేర్కొన్నాయి. ఈ ఏడాది చివరలో జరగబోయే ఇజ్రాయెల్ పార్లమెంటు ఎన్నికల్లో తన ప్రాబల్యాన్ని నిలబెట్టుకొనేందుకే ప్రధాని నెతన్యాహు ఈ దాడులు కొనసాగిస్తున్నారని నిఘా వర్గాలు ట్రంప్ ప్రభుత్వానికి నివేదించినట్లు వాషింగ్టన్ పోస్ట్ వార్తా సంస్థ పేర్కొంది. అయినా నెతన్యాహును ట్రంప్ ఆకాశానికి ఎత్తేశారు. శనివారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. నెతన్యాహు తనకు మంచి మిత్రుడని, ఆయన పోరాటయోధుడైన ప్రధాని అని కొనియాడారు. కాగా, పరిస్థితిని మళ్లీ గాడిలో పెట్టేందుకు మధ్యవర్తి పాకిస్థాన్ రంగంలోకి దిగింది. పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహిసిన్ నఖ్వీ శనివారం ఇరాన్ వెళ్లారు. అక్కడ ఆయన తమ దేశ సీనియర్ నేతలతో చర్చలు జరపనున్నట్లు ఇరాన్ మీడియా సంస్థ ఇర్నా తెలిపింది. కాగా, శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్‌పై ట్రంప్ ప్రశంసల జల్లు కురిపిస్తుండగా, ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాత్రం విమర్శలు గుప్పించారు. ఓ పాడ్‌క్యాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌లో మీడియా స్వేచ్ఛ శూన్యమని అన్నారు. అందుకే శాంతి ఒప్పంద పత్రం విడుదల ఆలస్యమైందని పేర్కొన్నారు.

## 27 లక్షల మంది విద్యార్థులకు విజయ డెయిరీ పాలు

(మొదటి పేజీ తరువాయి)

పాలిచ్చే పశువుల సంఖ్య తదితర వివరాలతో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాల సేకరణకు సంబంధించి పాడి రైతులకు బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవసరాలకు తగినంత పాల ఉత్పత్తి జరగడం లేదని, పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే పాడి రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.

## 9.44 కోట్ల రైతులకు.. 18,880 కోట్లు


కోల్‌కతా, జూన్ 20: దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం–కిసాన్) పథకం నిధులు విడుదలయ్యాయి. బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. పీఎం కిసాన్ 23వ విడత కింద మొత్తం రూ.18,880 కోట్లను ఒకేసారి విడుదల చేశారు. 2019లో ప్రారంభమైన ఈ పథకం కింద అర్హులైన రైతులకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) కింద ఏటా మూడు దఫాలుగా రూ.2,000 చొప్పున మొత్తం రూ.6,000 కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటివరకు రూ.4.46 లక్షల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. 23వ విడతలో బెంగాల్‌లో 45.35 లక్షలకు పైగా రైతులకు రూ.907 కోట్లు చెల్లించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.




# కుటుంబానికి కొండంత అండ... నాన్న

**- తండ్రి త్యాగమే పిల్లల విజయానికి పునాది**

**- నిశ్శబ్దంగా కష్టపడుతూ కుటుంబానికి అండగా నిలిచే మహోన్నత వ్యక్తికి ఫాదర్స్ డే శుభాకాంక్షలు**




రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
ప్రపంచంలో ప్రతి వ్యక్తి జీవితంలో తండ్రి పాత్ర ఎంతో గొప్పది. తల్లి ప్రేమను మాటల్లో, చేతల్లో వ్యక్తపరిస్తే.. తండ్రి ప్రేమ తన బాధ్యతల్లో, త్యాగాల్లో, కష్టాల్లో కనిపిస్తుంది. కుటుంబ సంతోషం కోసం తన వ్యక్తిగత కోరికలను పక్కన పెట్టి, పిల్లల భవిష్యత్తు కోసం జీవితాంతం శ్రమించే మహోన్నత వ్యక్తి తండ్రి. అందుకే ప్రతి సంవత్సరం జూన్ నెల మూడో ఆదివారం జరుపుకునే ఫాదర్స్ డేకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.పిల్లలు జన్మించిన క్షణం నుంచే వారి భవిష్యత్తుపై ఎన్నో కలలు కనే వ్యక్తి తండ్రి. పిల్లలకు మంచి విద్య, మంచి జీవితం, సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించాలనే లక్ష్యంతో నిరంతరం కష్టపడతాడు. ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వాటిని తనలోనే దాచుకుని, కుటుంబ సభ్యులకు సంతోషాన్ని పంచేందుకు ప్రయత్నిస్తాడు. తన బాధలను బయటకు చెప్పకుండా, కుటుంబానికి బలంగా నిలబడటం ప్రతి తండ్రి ప్రత్యేకత. తండ్రి పిల్లలకు కేవలం ఆర్థిక భరోసా మాత్రమే కాదు, జీవితానికి అవసరమైన విలువలను కూడా అందిస్తాడు. నిజాయితీ, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసం, బాధ్యత వంటి లక్షణాలను పిల్లల్లో పెంపొందించే తొలి గురువు తండ్రే. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో, ఓటమిని ఎలా జీర్ణించుకోవాలో, విజయాన్ని ఎలా ఆస్వాదించాలో నేర్పించే వ్యక్తి కూడా తండ్రే.నేటి సమాజంలో చాలా మంది తండ్రులు కుటుంబ పోషణ కోసం స్వగ్రామాలకు, కుటుంబాలకు దూరంగా ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. పిల్లల అవసరాల కోసం తమ ఇష్టాలను, తమ సౌకర్యాలను వదులుకుంటున్నారు. ఎన్నో సందర్భాల్లో పిల్లలు తమ తండ్రి కష్టాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేక పోయినా, వారి ప్రతి విజయానికి వెనుక తండ్రి శ్రమ, త్యాగం, ఆశీస్సులు ఉంటాయి. పిల్లలు మొదటి అడుగు వేస్తే ఆనందపడేది తండ్రి. వారు చదువులో, ఉద్యోగంలో, జీవితంలో ఎదిగితే గర్వపడేది తండ్రి. తన సంతోషం కంటే పిల్లల సంతోషానికే ఎక్కువ విలువ ఇచ్చే వ్యక్తి తండ్రి. అందుకే తండ్రి ప్రేమను కొలవడం అసాధ్యం. అది మాటల్లో చెప్పలేనిది, కానీ జీవితాంతం అనుభూతి చెందేదిగా ఉంటుంది..ప్రస్తుత వేగవంతమైన జీవితంలో తల్లిదండ్రులతో గడిపే సమయం తగ్గిపోతున్న నేపథ్యంలో, ఫాదర్స్ డే ఒక వేడుక మాత్రమే కాకుండా కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసుకునే అవకాశంగా మారింది. తండ్రి చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, ఆయనకు కృతజ్ఞతలు తెలియజేయాల్సిన రోజు ఇది. ఒక చిన్న ధన్యవాదం, ఒక ప్రేమపూర్వక పలకరింపు, ఒక ఆప్యాయ ఆలింగనం కూడా తండ్రికి ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. తండ్రి ఉన్నప్పుడు ఆయన విలువను గుర్తించడం, ఆయన ఆశయాలను గౌరవించడం ప్రతి బిడ్డ బాధ్యత. తండ్రి కలలు కన్న ఉన్నత స్థాయికి చేరుకోవడం, ఆయనకు గర్వకారణంగా నిలవడం పిల్లలు ఇవ్వగలిగే గొప్ప బహుమతి. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా తండ్రి చూపిన మార్గం, ఆయన నేర్పిన విలువలు ఎప్పటికీ మరువకూడదు. ఫాదర్స్ డే సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ తండ్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన ఆరోగ్యం, ఆనందం కోసం ప్రార్థించాలి. తండ్రి ప్రేమ, త్యాగం, కష్టానికి గౌరవం తెలుపుతూ ఆయనతో మరింత సమయం గడపాలి. ఎందుకంటే జీవితంలో ఎన్నో బంధాలు వచ్చినా, తండ్రి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు..ప్రేరణాత్మక సందేశం.తండ్రి తన జీవితాన్ని పిల్లల భవిష్యత్తుకు అంకితం చేస్తాడు. పిల్లలు తమ విజయాన్ని తండ్రికి అంకితం చేస్తేనే ఆయన త్యాగానికి నిజమైన గౌరవం లభిస్తుంది.తండ్రి చెమట చుక్కలు ఎండిపోవచ్చు... కానీ ఆయన చేసిన త్యాగాల విలువ ఎప్పటికీ చెరిగిపోదు..ప్రపంచంలో గొప్ప నాయకుడు, గొప్ప గురువు, గొప్ప రక్షకుడు ఎవరు అంటే... తన పిల్లల కోసం జీవించే తండ్రే. ఈ ఫాదర్స్ డే సందర్భంగా తండ్రి చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుదాం. తండ్రి మన కోసం ఎంత కష్టపడతాడో అర్థం చేసుకుని, ఆయన కలలను సాకారం చేయడానికి మనమూ కృషి చేద్దాం. ఎందుకంటే తండ్రి చిరునవ్వే పిల్లల విజయం, పిల్లల విజయమే తండ్రికి నిజమైన బహుమతి.



## తెలంగాణ ఉద్యమకారుల భూ పోరాటానికి సిద్ధం కావాలి

పట్టాన్చెరు 20 (వార్త వేదిక సూర్య)
చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమకారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు 25 వేల పెన్షన్ సౌకర్యం కల్పిస్తానని ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టి మూడు సంవత్సరాలు గడుస్తున్న ఉద్యమకారులకు ఇంతవరకు ఎలాంటి న్యాయం జరగలేదని కాలయాపన కోసమే కేకే కమిటీ వేశారని ఉద్యమకారులకు ఇస్తా అని ఒప్పుకున్న 250 గజాలు ఇంటి స్థలాన్ని ఉప్పల్ బగాయతులో ఉన్న ప్రభుత్వ భూమిని భూ పోరాటం ద్వారా టిఆర్ఎస్ పార్టీ కల్వకుంట్ల కవిత గారి ఆధ్వర్యంలో పోరాటం చేసి నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు పంచుతామని జూలై రెండో తారీకు రోజు ఉదయం 10 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు ఉప్పల్ చేరుకోవాలని దీనిని మరో మిలియన్ మార్చ్ తలపించే విధంగా వేలాదిగా రాష్ట్ర నలుమూలల నుండి తరలి రావాలని పటాన్చెరు నియోజకవర్గంలో టిఆర్ఎస్ నాయకులు మరియు ఉద్యమకారులు పిలుపునివ్వడం జరిగింది.
ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ప్రజాపతి మెదక్ జిల్లా ఇంచార్జ్ శివశంకర్ రేఖ గారు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు మాదాసు శ్రీనివాస్ . ఉద్యమకారుడు రామగిరి ప్రకాష్ గారు తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై శిక్షణా కార్యక్రమం

**- మంచిరేవుల కమ్యూనిటీ హాల్‌లో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలకు అవగాహన**

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :



ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు నార్సింగి సర్కిల్ పరిధిలోని బీఎల్‌వోలు (బూత్ స్థాయి అధికారులు), బీఎల్‌ఏలకు (బూత్ స్థాయి ఏజెంట్లు) మంచిరేవుల కమ్యూనిటీ హాల్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ఎస్ఐఆర్ కార్యక్రమం లక్ష్యాలు, విధివిధానాలు, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నార్సింగి డిప్యూటీ కమిషనర్, సహాయ మున్సిపల్ కమిషనర్లు (ఏఎంసీలు) పాల్గొని అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఓటరు జాబితాలను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు ఎన్నికల ప్రక్రియలో తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అవగాహన పొందినట్లు అధికారులు తెలిపారు.

## శంషాబాద్ జోన్‌లో సమీక్ష సమావేశం

**- వర్షాకాల సన్నద్ధత, ప్రజా సేవల మెరుగుదలపై అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు**

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
శంషాబాద్ సర్కిల్--18 జోనల్ కమిషనర్ కార్యాలయంలో శనివారం జోనల్ కమిషనర్ కుమారి కె. చంద్రకళ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని వివిధ శాఖల పనితీరు, ప్రజా సేవల మెరుగుదల, వర్షాకాల సన్నద్ధత అంశాలపై అధికారులు విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మాన్సూన్ ప్రిపేర్డ్నెస్, పారిశుధ్య నిర్వహణ, టౌన్ ప్లానింగ్, ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు, వెటర్నరీ సేవలు, ఇంజినీరింగ్ పనులు, ఎంటమాలజీ విభాగం కార్యకలాపాలు, వీధి దీపాల నిర్వహణ, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, అర్బన్ బయోడైవర్సిటీ వంటి అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలు, పారిశుధ్య సమస్యలు, ప్రజలకు కలిగే ఇబ్బందులను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ కిష్టప్ప, జాయింట్ కమిషనర్ శ్రీ రాజు, శంషాబాద్ సర్కిల్--18 డిప్యూటీ కమిషనర్ శ్రీ బి. సుమన్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై బీసీ సంఘాల ఆందోళన

**- గణాంక ఆధారిత సమాచారం లేకుండా 10 శాతం రిజర్వేషన్ అమలు అన్యాయం: డాక్టర్ అవ్వారు వేణుకుమార్**

**- 4 శాతం జనాభాకు 10 శాతం కోటా కల్పించడం జనాభా నిష్పత్తికి విరుద్ధమని విమర్శ**



రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) కల్పిస్తున్న 10 శాతం రిజర్వేషన్ విధానంపై 42 శాతం బీసీ రిజర్వేషన్ పోరాట కమిటీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రిజర్వేషన్లఅమలుకు అవసరమైన గణాంక ఆధారిత సమాచారం, సామా జిక-ఆర్థిక అధ్యయనాలు లేకుండానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కమిటీ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ అవ్వారు వేణుకుమార్ ఆరోపించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం 2021లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య--33 ద్వారా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకొచ్చిం దని, అయితే ఆ నిర్ణయానికి ముందు రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ వర్గాల వాస్తవ జనాభా, వారి విద్యా, ఉద్యోగ, సామాజిక ప్రాతినిధ్య స్థితిగతులపై ఎలాంటి సమగ్ర సర్వే నిర్వహించలేదని పేర్కొన్నారు.తెలంగాణ కుల సర్వే--2024లో వెల్లడైన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో అగ్రవర్ణాల జనాభా 12.35 శాతం మాత్రమేనని, అందులో వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉన్న ఈడబ్ల్యూఎస్ అర్హుల శాతం సుమారు 4 శాతానికి పరిమితమైందని తెలిపారు. కేవలం 4 శాతం జనాభా కలిగిన వర్గానికి 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం సామాజిక న్యాయం, జనాభా నిష్పత్తి సూత్రాలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఎం. నాగరాజ్, జర్నైల్ సింగ్ తదితర కీలక తీర్పుల్లో గణాంకపరంగా నిరూపించగల సమాచారం ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నదని గుర్తు చేశారు. అలాంటి సమాచారం లేకుండా రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయించడం న్యాయపరంగా నిలబడదని అన్నారు.
ప్రభుత్వం వెంటనే స్వతంత్ర నిపుణుల కమిషన్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ వర్గాలపై సమగ్ర సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆ సర్వే ఫలితాలను ప్రజల ముందుంచి, వాటి ఆధారంగానే రిజర్వేషన్ శాతంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తే విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ యువజన సంఘాలు, బీసీ హక్కుల పరిరక్షణ వేదికలు మరియు ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, అవగాహన సభలు, ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు




**- యోగతో ఆరోగ్యం... యోగతో ఆనందం... యోగతో సర్వాంగ సుందర జీవనం!**

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించబడుతుంది. భారతదేశపు ప్రాచీన ఋషులు మానవాళికి అందించిన అమూల్యమైన ఆధ్యాత్మిక, శారీరక సంపద యోగా. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన యోగా నేడు ప్రపంచ దేశాలన్నింటి లోనూ ఆరోగ్య సాధనగా గుర్తింపు పొందింది. 2014లో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడంతో యోగాకు అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యత లభించింది. "యోగ" అనే పదం సంస్కృతంలోని "యుజ్" అనే ధాతువు నుంచి ఉద్భవించింది. దీని అర్థం కలయిక లేదా ఏకత్వం. శరీరం, మనస్సు, ఆత్మలను సమన్వయం చేయడమే యోగా ప్రధాన లక్ష్యం. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదు; అది ఒక సంపూర్ణ జీవన విధానం. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసం కోసం యోగా అత్యుత్తమ మార్గం.
నేటి ఆధునిక జీవన విధానంలో ఒత్తిడి, ఆందోళన, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో యోగా మనిషికి ఒక వరంలా మారింది. ప్రతిరోజూ కొద్దిసేపు యోగా చేయడం ద్వారా శరీరం దృఢంగా మారడమే కాకుండా మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు వంటి అనేక వ్యాధులను నియంత్రించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుంది.యోగా వల్ల శరీరంలోని కండరాలు, నరాలు బలపడతాయి. శ్వాసక్రియ మెరుగుపడుతుంది. జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు ఇలా అన్ని వయస్సుల వారికీ యోగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుత కాలంలో మానసిక ఒత్తిడి అనేది ఒక పెద్ద సమస్యగా మారింది. ధ్యానం, ప్రాణాయామం వంటి యోగా ప్రక్రియలు మనస్సును ప్రశాంతంగా ఉంచుతాయి. కోపం, ఆందోళన, భయం, నిరాశ వంటి భావోద్వేగాలను నియంత్రించడంలో యోగా సహాయపడుతుంది. ఏకాగ్రతను పెంచి, ఆత్మవిశ్వాసాన్ని మెరుగుప రుస్తుంది. విద్యార్థుల్లో చదువుపై దృష్టి పెరగడానికి, ఉద్యోగుల్లో పనితీరు మెరుగుపడడానికి యోగా ఎంతో దోహదపడుతుంది. ప్రస్తుతం ప్రపంచంలోని 190కి పైగా దేశాల్లో యోగా సాధన జరుగుతోంది. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, ఆరోగ్య కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకున్నారు. భారతదేశం నుంచి ప్రారంభమైన ఈ యోగా ఉద్యమం నేడు ప్రపంచ మానవాళి ఆరోగ్యానికి మార్గదర్శకంగా నిలిచింది. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, సోషల్ మీడియా వినియోగం అధికమవుతున్న నేపథ్యంలో యువత శారీరక కార్యకలాపాలకు దూరమవుతోంది. దీంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. యువత ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా సాధన చేస్తే శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెరుగుతాయి. క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల ఆలోచనలు అలవడతాయి. యోగా వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా సమాజ శ్రేయస్సుకు కూడా తోడ్పడుతుంది. ఆరోగ్యవంతమైన పౌరులు ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. అందుకే యోగాను ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరువ చేయాల్సిన అవసరం ఉంది. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన, ప్రశాంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు; ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకునే ఒక ఉద్యమం. యోగా మనిషి జీవితంలో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడే అద్భుత సాధనం. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేసి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఈ యోగా దినోత్సవం సందేశం ఇస్తోంది.



## రాజేంద్రనగర్‌లో రూ.1.45 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన

**- ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలే లక్ష్యం - - ఎమ్మెల్యే**

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి మరో అడుగు పడింది. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రూ.1.45 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్-11 పరిధిలోని హైదర్‌గూడ, అత్తాపూర్ డివిజన్లలో చేపట్టనున్న సీసీ రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి కాలనీ, ప్రతి గల్లీ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. హైదర్‌గూడ డివిజన్-113 పరిధిలో రూ.68.45 లక్షలతో వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, చైతన్య విలాస్ కాలనీ, ఉప్పరపల్లి ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, జనప్రియ యుటోపియా నుంచి రాధాకృష్ణనగర్ వరకు సీసీ ప్యాచ్ వర్క్స్, పిల్లర్ నెం.135 నుంచి ఈశ్వర్ థియేటర్ వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నారు.అలాగే అత్తాపూర్ డివిజన్-112 పరిధిలో రూ.77.10 లక్షల వ్యయంతో అత్తాపూర్ పాత గ్రామం, తేజస్విని కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పాండు రంగనగర్, ఉమా నిలయం ప్రాంతాల్లో 600 మి.మీ ఆర్‌సీసీ పైప్‌లైన్‌తో స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులు చేపట్టనున్నారు. మంజూరైన పనులన్నింటినీ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జూన్ 25 నుంచి ఎస్ఐఆర్ ప్రారంభం..

**రాజేంద్రనగర్‌లో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలకు అవగాహన సదస్సు**

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీ లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బీఎల్‌వోలు (బూత్ లెవల్ అధికారులు) మరియు బీఎల్‌ఏలకు (బూత్ లెవల్ ఏజెంట్లు) అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ అసెంబ్లీ ఎన్నికల అధికారి మరియు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎంఆర్ఓ బొమ్మ శ్రీరాములు, రంగారెడ్డి జిల్లా ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ శ్రీలత హాజరై ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం, ఓటరు జాబితా సవరణలు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, తొలగింపుల ప్రక్రియ తదితర అంశాలపై అధికారులు వివరించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌ఏలు, ఎన్నికల శాఖ అధికారులు, భారతీయ జనతా పార్టీ తరఫున ఆడికే రాజు, ఆడికే మహేందర్, బల్ల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## అయోధ్య పద్మశాలి సత్రం నిర్మాణ ధర్మకర్తగా ఎన్నికైన నర్సింగరావుకు ఘన సన్మానం

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
అయోధ్యలో నిర్మించ తలపెట్టిన అఖిల భారత పద్మశాలి సత్రం భవన నిర్మాణానికి ధర్మకర్తగా ఎన్నికైన కార్వాన్ శ్రీ శివ మార్కండేయ దేవాలయ కమిటీ అధ్యక్షుడు, పద్మశాలి సంఘం కోశాధికారిగా దశాబ్ద కాలంగా సేవలందిస్తున్న అతిపముల నర్సింగరావు కి ఘన సన్మానం నిర్వహించారు. కార్వాన్‌లోని మార్కండేయ భవన్‌లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో నర్సింగరావు--సరళ దంపతులను శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి, మిఠాయిలు తినిపిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అయోధ్యలో పద్మశాలి సత్రం నిర్మాణ బాధ్యతల్లో భాగంగా ధర్మకర్తగా ఎన్నిక కావడం సమాజానికి గర్వకారణమని పలువురు నాయకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అంబటి సంతోష్, కార్వాన్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గంజి రఘునాథ్, సలహాదారులు చెన్న నరేందర్, దోర్నాల ప్రసాద్, ముదిగొండ యాదగిరి, దావత్ నర్సింగ్, చిత్రాల చంద్రశేఖర్, కందగట్ల సత్యనారాయణ, రూపేందర్ కుమార్ తదితరులు పాల్గొని నర్సింగరావు దంపతులను ఘనంగా సన్మానించారు. అయోధ్యలో నిర్మించనున్న అఖిల భారత పద్మశాలి సత్రం భవనం దేశవ్యాప్తంగా ఉన్న పద్మశాలి సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని, ఈ నిర్మాణం విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం
జూన్ 21, 2026
సంపుటి : 2 సంచిక : 32
Follow:

# అమ్మ ప్రేమ గోరుముద్దలతో ఆత్మీయ విందు!

- శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా 'మాతృ హస్త భోజనం'
- జంక్ ఫుడ్‌కు దూరంగా... సాంప్రదాయ రుచుల వైపు అడుగులు
- ఉమ్మడి కుటుంబాన్ని తలపించిన పాఠశాల ప్రాంగణం

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
అదొక పాఠశాల ప్రాంగణం.. కానీ శనివారం మధ్యాహ్నం అక్కడ ఏ క్లాస్ రూముల్లోనూ పాఠాలు సాగలేదు. బెల్ శబ్దం వినిపించలేదు. దానికి బదులుగా.. అక్కడ ఒక పెద్ద ఉమ్మడి కుటుంబం ఆవిష్కృతమైంది. వందలాది మంది తల్లులు, వారి పిల్లల నవ్వులు, ముచ్చట్లు, ఆత్మీయ పలకరింపులతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణాన్ని తలపించింది. స్థానిక బండ్లగూడ జాగీర్‌లోని 'శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్' యాజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'మాతృ హస్త భోజనం' కార్యక్రమం ప్రతి ఒక్కరి హృదయాలను హత్తుకుంది. ఆధునిక కాలంలో కనుమరుగవుతున్న పాతరోజుల నాటి కుటుంబ అనుబంధాలను, అమ్మ ప్రేమను నేటి తరానికి రుచి చూపించేందుకు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలంతా ఇంటి భోజనాన్ని కాదని, రంగు రంగుల ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, పిజ్జాలు, బర్గర్ల వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. ఆరోగ్యానికి తీవ్ర హాని చేసే ఈ కమర్షియల్ ఫుడ్ కల్చర్ ట్రెండ్‌ను బ్రేక్ చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. కేవలం మార్కులు, ర్యాంకులు, రాకెట్ సైన్స్ మాత్రమే చదువు కాదు.. పిల్లల్లో ఆరోగ్యకరమైన అలవాట్లను, ప్రాథమిక కుటుంబ విలువలను పెంచి పోషించాలనే సంకల్పంతో స్కూల్ యాజమాన్యం ఈ లంచ్ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థుల తల్లులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ



పిల్లలకు ఇష్టమైన సాంప్రదాయ వంటకాలను స్వయంగా ఇంట్లోనే ఎంతో ప్రేమతో తయారు చేసుకుని పాఠశాలకు తీసుకువచ్చారు. పాతకాలపు పద్ధతిలో నేలమీదనే చాపలు వేసి, లైన్లుగా కూర్చుని తల్లులంతా తమ పిల్లల పక్కన చేరారు. ముచ్చట్లు చెపుతూ, నవ్వుతూ, తమ చేతులతో పిల్లలకు గోరుముద్దలు తినిపిస్తుంటే స్కూల్ ప్రాంగణమంతా ఒక పెద్ద పల్లెటూరి ఉమ్మడి కుటుంబాన్ని తలపించింది. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఎంతోమంది తల్లులు ఈ సందర్భంగా భావోద్వేగానికి లోనయ్యారు. చాలా కాలం తర్వాత పిల్లలతో ఎలాంటి హడావుడి లేకుండా, మొబైల్ ఫోన్లకు దూరంగా గడిపే అవకాశం దొరికిందని మాతృమూర్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కార్యదర్శి విశ్వేశ్వరరావు, ట్రెజరర్ పసర్తి మల్లయ్య, సభ్యులు వెంకటస్వామి, రాజిరెడ్డి స్ఫూర్తిని, దిశా నిర్దేశాన్ని అందించారు. ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ రమాదేవి నేతృత్వంలో అధ్యాపకులు, లెక్చరర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.






## మైలర్‌దేవ్‌పల్లి, కాటేదాన్ అభివృద్ధి పనులకు నిధుల మంజూరుపై జి హెచ్ ఎం సి కమిషనర్‌తో తోకల శ్రీనివాస్ రెడ్డి భేటీ

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైలర్‌దేవ్‌పల్లి, కాటేదాన్ డివిజన్లలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజ్ పైప్‌లైన్‌లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా కేటాయింపులు వెంటనే విడుదల చేసి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, సంబంధిత నిధుల మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టి అభివృద్ధి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్‌తో పాటు డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## యోగా ఆరోగ్యానికి అమూల్య వరం : సంతోష్ గౌడ్

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాటేదాన్ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు సంతోష్ గౌడ్ కార్యాలయంలో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ గౌడ్ మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని అన్నారు. యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగా సాధనకు కేటాయించాలని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు యువకులు, మహిళలు పాల్గొని వివిధ యోగా ఆసనాలు చేశారు.

## మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం విజయవంతం

కూకట్ పల్లి, జూన్ 20 (వార్త వేదిక సూర్య) :
శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్ నగర్ డివిజన్ మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్ నంబర్ 2140/2006)ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సాధారణ సభ్యుల సమావేశం (జనరల్ బాడీ మీటింగ్) విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు, సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన కాలనీ సభ్యులందరికీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ ఎన్నికలను నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని సభ్యులు సూచించారు. ఎన్నికల తేదీ, ఎన్నికల ప్రక్రియ, నామినేషన్లు, ఇతర పూర్తి వివరాలను తదుపరి 24 గంటలలో ప్రకటిస్తామని మిత్రా హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం వెల్లడించింది. కాలనీ అభివృద్ధి కోసం సభ్యులందరూ ఇదే విధంగా సహకరించాలని కార్యవర్గం కోరింది.

## ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చేపట్టాలి

**కూకట్ పల్లి, బాలానగర్ మండలాల విద్యాశాఖాధికారులకి వినతి పత్రం సమర్పించిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు**

కూకట్ పల్లి, జూన్ 20 (వార్త వేదిక సూర్య) :
ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తూము నిఖిల్ కుమార్, బిఆర్ఎస్ వి రాష్ట్ర నాయకులు అశ్వంత్ కుమార్ కూకట్ పల్లి, బాలానగర్ మండలాల విద్యాశాఖాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నాయని, విద్యను వ్యాపార సంస్థలుగా మార్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేనందువలన పిల్లల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారని, మౌలిక సదుపాయాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా హాజరు శాతం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు, జిల్లా అక్షయ్, సూర్య, పల్లపు గిరీష్, దుర్గా ప్రసాద్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ కౌంట్‌డౌన్ కార్యక్రమంలో పాల్గొన్న నిరుడు శేఖర్ ముదిరాజ్

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన "1-డే కౌంట్‌డౌన్ ఈవెంట్" కార్యక్రమంలో కిస్మత్‌పూర్ మాజీ ఉప సర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు నిరుడు శేఖర్ ముదిరాజ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన యోగా సాధనలో పాల్గొన్న నిరుడు శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ, యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు.

## సింగిల్ విండో చైర్మన్ గా చెరుపల్లి అంజనేయులు

చండూరు జూన్ 20 వార్తా వేదిక సూర్య



సింగిల్ విండో చైర్మన్ గా గట్టుప్పల్ గ్రామానికి చెందిన చెరిపెల్లి ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీస్సులతో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో తమకు పదవి వచ్చిందన్నారు. పార్టీ కోసం నిజాయితీగా ఒక నిబద్ధత తో కష్టపడి పని చేసే గట్టుప్పల మండల యువ నాయకుడు చెరుపల్లి ఆంజనేయులు గుర్తింపు ను ఇచ్చిన ఘనత మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కె దక్కిందన్నారు. పార్టీ కోసం ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే వ్యక్తులకు గుర్తింపు ను ఇవ్వడం గర్వకారణం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కే దక్కుతుందన్నారు. నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవ చేస్తానని చెప్పారు ఈ బ్యాంకు అభివృద్ధి మరింత ముందుకు తీసుకెళ్తారని ఆయన తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సంఘం డైరెక్టర్లకు చండూరు మున్సిపాలిటీ చైర్మన్ కోడి శ్రీనివాసులు, ఎఫ్ ఎస్ సి ఎస్ మాజీ చైర్ పర్సన్ మున్సిపల్ కౌన్సిలర్ కోడి సుష్మ వెంకన్న మండల పార్టీ అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పట్టణ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ గారికి డిసిసి ఉపాధ్యక్షులు దండు యాదగిరి రెడ్డి, గట్టుప్పల మండల పార్టీ అధ్యక్షులు సర్పంచ్ నామని జగన్నాథం లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా యోగా దినోత్సవం

చౌటుప్పల్ జూన్ 20 వార్తా వేదిక సూర్య



ప్రపంచ యోగ డే సందర్భంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ లో ట్రినిటీ హైస్కూల్లో శనివారం విద్యార్థులు యోగ ఆసనాలు వేశారు అలాగే యోగ డే ఆకారంలో విన్యాసాలు వేశారు ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు మాట్లాడుతూ యోగాను ప్రపంచానికి తెలియజేసిన ఘనత భారతదేశంలోని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిసి రోడ్ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ - కంది శైలజ శ్రీకాంత్

సికింద్రాబాద్, జూన్ 20(వార్త వేదిక సూర్య)



అభివృద్ధి విషయంలో వెనకడుగువేయమని బౌద్ధనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని లేన్ నెంబర్ 05 లో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ పనులను పరిశీలించారు . అనంతరం బస్తీలో పర్యటించి అక్కడ ఉన్న బస్తి వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బిఆర్ఎస్ పార్టీ తోనే అభివృద్ధి పనులు సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా మీకు ఎ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు ఆ సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బ్రహ్మచారి, వినోద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## తార్నాక డివిజన్లో ఎస్ఐఆర్ కార్యక్రమం

సికింద్రాబాద్, జూన్ 20(వార్త వేదిక సూర్య)
మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్ బరోడ లేన్ పలు ప్రాంతాల్లో బిఆర్ఎస్ పార్టీ మహిళ సీనియర్ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ పర్యటించి ఎస్ఐఆర్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు

## హైదరాబాద్ అమెరికన్ కాన్సులేట్ రోడ్డుకు 'ట్రంప్' పేరు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

**సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం**

చౌటుప్పల్ టౌన్ జూన్ 20:వార్తా వేదిక సూర్య
హైదరాబాద్ లోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు.
శనివారం రోజున చౌటుప్పల్ మండల కేంద్రంలో సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశం జిల్లా కోశాధికారి యండి పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం అనంతరం, కాన్సులేట్ రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కార్మికులు, నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి చౌటుప్పల్ బస్టాండ్ సమీపంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లూరి మల్లేశం మాట్లాడుతూ హైదరాబాద్ లోని నానక్ రాంగూడ లోని అమెరికా కాన్సులేట్ రోడ్డుకు ట్రంప్ పేరుపెట్టడం సిగ్గుచేటన్నారు.పాలస్తీనా, ఇరాన్ లలో వేలాది మంది మరణానికి కారణమైన,పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు



కారణమైన ,ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న , ఇరాన్ దేశ సుప్రీమ్ లీడర్ నీ హత్య చేసిన, ఇరాన్ లో 150 మంది స్కూల్ పిల్లల హత్యచేసిన నర హంతక ట్రంప్ పేరుపెట్టాలని "రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సరికాదని, వెంటనే ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని" రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి యండి పాషా, సిఐటియు జిల్లా కమిటి సభ్యులు జొన్నకంటి దేవయ్య,నాయకులు మాంద్ర శ్రీను, గుడ్డేటి పాపయ్య, గడ్డం వెంకటేష్, టి మల్లేష్,కోళ్ళ మల్లయ్య, ఎల్లయ్య, సంజీవ, నవనీత , పార్వతమ్మ,సుగుణమ్మ, జయమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## యోగా ద్వారా ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు

**పోలీస్ సిబ్బందికి యోగా, ధ్యాన శిక్షణ.. మానసిక ప్రశాంతతే లక్ష్యం**

**బాలానగర్ సీఐ నర్సింహా రాజు!**

బాలానగర్, జూన్ 20 (వార్త వేదిక సూర్య) :
నిరంతరం విధుల్లో ఉంటూ ఒత్తిడిని ఎదుర్కొనే పోలీస్ సిబ్బంది కోసం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక యోగా, ధ్యాన సాధన కార్యక్రమం నిర్వహించారు. సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో శనివారం ఉదయం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. విధి నిర్వహణలో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం ఎంత అవసరమో ఈ సందర్భంగా సీఐ సిబ్బందికి వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అలసిపోని విధులతో ఒత్తిడికి గురయ్యే పోలీస్ సిబ్బందికి శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడమే లక్ష్యంగా బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. శనివారం ఉదయం స్టేషన్ ప్రాంగణంలో ఎస్ఐలు సరిత రెడ్డి, వినోద్ కుమార్ సిబ్బందితో కలిసి ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా బాలానగర్ సీఐ నరసింహ రాజు మాట్లాడుతూ పోలీసులకు యోగా, ధ్యానం ఎంతో అత్యవసరమని, నిత్య జీవితంలో వీటిని ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. శ్వాసపై నియంత్రణ సాధించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, వృత్తిపరమైన బాధ్యతలను మరింత ఉత్సాహంగా, ఏకాగ్రతతో నిర్వహించేందుకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు." ఈ సాధన శిక్షణలో భాగంగా సిబ్బందికి అలసటను తగ్గించే ఆసనాలు, కోపాన్ని నియంత్రించి ఏకాగ్రతను పెంచే ప్రాథమిక ధ్యాన పద్ధతులు, ప్రాణాయామంపై ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయించారు. యోగా ద్వారా ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని సీఐ నర్సింహా రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు అంగన్వాడీలే పునాది - బండారి శంకర్

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
సమాజంలో ఆరోగ్యవంతమైన తరాలను తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్ అన్నారు. శనివారం శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన 'అమ్మ మాట -- అంగన్వాడి బాట' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులు, గర్భిణీలు, బాలింతల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా బండారి శంకర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారం పంపిణీ చేసే కేంద్రాలే కాకుండా చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి బలమైన పునాదులు వేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం వల్ల చిన్నారుల్లో పోషకాహార లోపం తగ్గి ఆరోగ్యకరమైన ఎదుగుదల సాధ్యమవుతోందన్నారు. అలాగే గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలు వారి ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడు తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులతో అక్షరాభ్యాసం



నిర్వహించి, వారికి స్కూల్ యూనిఫాంలు పంపిణీ చేశారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్న అవగాహన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం అవసరాన్ని గుర్తించి, ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని బండారి శంకర్ హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎం.జ్యోతి, ఆయా సంగీత, పబ్లిక్ హెల్త్ మేనేజర్ గౌరీ, ఆశా వర్కర్‌లు, స్థానిక నాయకులు డి.రమేష్, ఎన్.శేఖర్, డి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ--నెక్నాంపూర్ సమస్యలపై హైడ్రా కమిషనర్‌కు వినతి

**విద్యుత్ సబ్‌స్టేషన్, వాటర్ లాగింగ్, పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ**

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :
హైడ్రా కమిషనర్‌తో జరిగిన సమీక్ష సమావేశంలో మణికొండ, నెక్నాంపూర్ ప్రాంతాలకు సంబంధించిన పలు ప్రజా సమస్యలను ప్రతినిధుల బృందం ప్రస్తావించింది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సర్వే నెం.31లో సుమారు 1000 చదరపు గజాల ప్రభుత్వ భూమిని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించాల్సిన అవసరాన్ని నార్సింగి విద్యుత్ శాఖ ఏఈ వి. మణికాంత కమిషనర్ కు శనివారం ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశంపై స్పందించిన హైడ్రా కమిషనర్, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఎంఆర్వో, జిల్లా కలెక్టర్‌తో చర్చించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదే విధంగా నెక్నాంపూర్, మణికొండ ప్రాంతాల్లో కొనసాగుతున్న వాటర్ లాగింగ్ సమస్యలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పార్కుల అభివృద్ధి, ఓపెన్ స్పేస్‌ల సంరక్షణ అంశాలను కూడా ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా సర్వే నెం. 44/1, 44/2లోని ప్రభుత్వ భూముల రక్షణ, శ్రీ వెంకటేశ్వర కాలనీలోని పార్కుల అభివృద్ధి, వైఎస్సార్ కాలనీలోని పార్కుల సంరక్షణ అవసరాన్ని వివరించారు. హైడ్రా ఆధ్వర్యంలో ఇప్పటికే శ్రీ వెంకటేశ్వర కాలనీ, గోల్కొండ హిల్స్ ప్రాంతాల్లోని ఓపెన్ స్పేస్‌లు, పార్కులు ప్రజల వినియోగానికి అప్పగించబడిన నేపథ్యంలో వాటి అభివృద్ధి, నిర్వహణ కోసం సంబంధిత సీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు బి. ఉపేంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్ మహమ్మద్, ఖుర్షీద్, అతిఫ్ ఇషాక్, వసంత్, సుజాత, రూప, స్వాతి, శ్రీని, సిద్ధు, రాజు, కోటి రామ్ ప్రసాద్, శ్యామల, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.




# వన మహోత్సవం"లో మొక్కలు నాటిన దేవరకొండ ఎమ్మెల్యే

**దేవరకొండ జూన్ 20 (వార్తా వేదిక సూర్య):-**

దేవరకొండ పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, చెట్లు మానవ జీవితానికి ఎంతో అవసరమని, అవి ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు మరియు ప్రకృతి వైపరీత్యాలను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం అవసరమని పేర్కొన్నారు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను



నాటి దానిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా అవి పెద్ద చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు

తెలంగాణ ప్రభుత్వం హరిత తెలంగాణ లక్ష్యంతో చేపడుతున్న పచ్చదనం పెంపు కార్యక్రమాలకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. గ్రామాలు, పట్టణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు మరియు ప్రజా ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చని తెలంగాణ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని, ప్రకృతిని కాపాడడం ద్వారా భావితరాలకు మంచి భవిష్యత్తును అందించగలమని ఎమ్మెల్యే పేర్కొన్నారు

ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, ఆర్టీసీ అధికారులు మరియు సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అందరూ కలిసి మొక్కలు నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు



## చిన్నారులను ఆశీర్వదించిన రామావత్ రమేష్ నాయక్

**దేవరకొండ జూన్ 20 ( వార్తా వేదిక సూర్య):-**

కొండమల్లెపల్లి పట్టణంలోని కె.ఎం.ఆర్ గార్డెన్ లో కొండమల్లేపల్లి 11 వార్డు మెంబర్ వసుక్కుల శీను - స్వప్న దంపతుల చిన్నారులు నోయెల్,రాయల్ చిన్నారుల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామావత్ రమేష్ నాయక్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు వారితోపాటు ఏ .ఈ చందు నాయక్ 12 వార్డ్ మెంబర్ వెంకటయ్య, బుర్రి నవీన్, హరి , కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

## రాజకీయాల్లో యువత కీలక పాత్ర పోషించాలి

**సోషల్ మీడియాలో యువత, మార్క్ కనిపించాలి**

**దేవరకొండ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కేతావత్ భిల్యా నాయక్-**

**దేవరకొండ జూన్ 20 ( వార్తా వేదిక సూర్య ):-**



యువతే దేశానికి నిజమైన భవిష్యత్తు రాజకీయాల్లో యువత భాగస్వామ్యం పెరిగితే కొత్త ఆలోచనలు, కొత్త మార్పులు వస్తాయిప్రజా సమస్యలపై అవగాహన పెంచుకొని పరిష్కారానికి కృషి చేయాలికుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా ప్రజాసేవను లక్ష్యంగా పెట్టుకోవాలినిజాయితీ, నిబద్ధత, పారదర్శకతతో రాజకీయాల్లో ముందుకు సాగాలిఅవినీతికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడే నాయకత్వాన్ని అందించాలిగ్రామం నుంచి రాష్ట్రం వరకు అభివృద్ధిలో భాగస్వాములు కావాలిపేదలు, రైతులు, యువత, మహిళల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలిసోషల్ మీడియాను ప్రజా చైతన్యం కోసం బాధ్యతాయుతంగా వినియోగించాలిప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలియువ నాయకత్వం బలపడితే దేశ రాజకీయాలకు కొత్త దిశ, కొత్త ఆశలు కలుగుతాయినేటి యువత రాజకీయాల్లో ముందుకు వస్తే రేపటి భారతదేశం మరింత బలంగా, అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది.

## ఆర్థికంగా దోపిడి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు

**బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సతీష్ గౌడ్ ఆరోపించారు.**

**దేవరకొండ జూన్ 20 (వార్తా వేదిక సూర్య):-**



దేవరకొండ పట్టణంలో బీసీ సంఘ దేవరకొండ నియోజకవర్గ ముఖ్యకార్యకర్త సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ గౌడ్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చి ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం బాధాకరమన్నారు. విద్యార్థులు పాఠశాలల వద్ద నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తేవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న, పుస్తకాలు-యూనిఫాంల విక్రయాలను బలవంతం చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ పాఠశాలల దోపిడికి అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బీసీ పొలిటికల్ యువజన జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి మల్లేష్, బీసీ పొలిటికల్ జేఏసీ దేవరకొండ మండల అధ్యక్షులు బొడ్డుపల్లి సత్యం, బీసీ పొలిటికల్ యువజన జేఏసీ నేరడుగొమ్ము మండల అధ్యక్షులు నారమోని హరీష్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు వరికుప్పల ఆంజనేయులు, మహేష్, సిద్దు, తదితరులు పాల్గొన్నారు

# మార్నింగ్ వాక్ విత్ పీపుల్‌లో దేవరకొండ ఎమ్మెల్యే



**దేవరకొండ జూన్ 20 (వార్తా వేదిక సూర్య):-**

దేవరకొండ మండలంలోని సభావట్ తండా మరియు ధర్మతండా గ్రామాల్లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికార యంత్రాంగంతో కలిసి "మార్నింగ్ వాక్ విత్ పీపుల్" కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని సంబంధిత అధికారులతో అక్కడికక్కడే సమీక్ష నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ సందర్భంగా గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన "మంచినీటి బోరును ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు గ్రామ ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇదే గ్రామపంచాయతీ ధర్మ తండాలో ఎల్ఈడి లైట్లు ప్రారంభి, అధికారులు ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని చెట్లను నాటడం జరిగింది అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు తదుపరి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మండల పార్టీ నాయకులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# అధిక ఫీజుల నియంత్రణ అమలు చేయాలి

**-ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి**

**-బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**

**దేవరకొండ జూన్ 20 (వార్తా వేదిక సూర్య):-**

ప్రవేట్ పాఠశాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి, వాటిని వెంటనే నియంత్రించాలి బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ కోరారు.శనివారం బిఆర్ ఎస్వీ ఆధ్వర్యంలో మండల విద్యా శాఖ అధికారి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.పేద,మధ్య తరగతి ప్రజలకు ప్రవేట్ స్కూల్లో చదివించాలి అనే ఆశ ఉంటుంది, కానీ ప్రవేట్ స్కూల్ యజమానాలు ఫీజు లను విచ్చలవిడిగా పెంచి, విద్యార్థులను ఇబ్బందికి గురిచేస్తునారు అని ఆయన ఆరోపించారు.



వీటిని నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది అని తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాటినికూడా వెంటనే పరిశీలించి వెంటనే సమస్యల ను పరిష్కరించాలి ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ దేవరకొండ మండల అధ్యక్షులు పాత్లవత్ లక్ష్మణ్, ఎస్ కె జమీర్ బాబా, పంది హరికృష్ణ, బత్తుల ఆంజనేయులు, కొర్ర రాజేష్,రాఖీ,అనిల్, తదితరులు పాల్గొన్నారు



## అధికారులతో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సమీక్షా సమావేశం..

**రైతులకు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో యూరియా అందించాలి**

**దేవరకొండ జూన్ 20 (వార్తా వేదిక సూర్య ):-**

రాబోయే వానకాలం (ఖరీఫ్) సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని దేవరకొండ నియోజకవర్గంలోని రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు మరియు ఇతర వ్యవసాయ అవసరాలు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన అధికారులతో ఎరువుల లభ్యత, నిల్వలు మరియు సరఫరా వ్యవస్థపై విస్తృతంగా చర్చించారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతాంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతులు సాగు పనుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అన్ని మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు

ముందస్తు నిల్వలు

నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ( పిఎసిఎస్ ), రైతు సేవా కేంద్రాలు మరియు ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువుల డీలర్ల వద్ద సరిపడా యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకూడదు

వానకాలం సాగు పనులు ప్రారంభమైన తర్వాత ఎరువుల కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని, ప్రతి గ్రామంలోని రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు

ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచడం, కృత్రిమ కొరత సృష్టించడం లేదా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. అలాంటి అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వారి లైసెన్సులను రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు.

నిరంతర పర్యవేక్షణ:

ఎరువుల నిల్వలు, పంపిణీ మరియు విక్రయాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు

రైతులకు అవసరమైన వ్యవసాయ వనరులు సకాలంలో అందించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు

ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు



## నకిరేకల్ నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులు : గుత్తా సుఖేందర్‌రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ఉరుమడ్ల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం**

**నల్గొండ టౌన్ జూన్ 20 వార్త వేదిక సూర్య**

నకిరేకల్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి భువనగిరి ఎంపీ శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు

ఈరోజు ఉరుమడ్ల గ్రామంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం చేపట్టిన 15 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ బిల్డింగ్, మరియు 5 లక్షలతో నిర్మించిన గ్రంధాలయం భవణాలని ప్రారంభించారు

విద్య, ఆరోగ్యం సంక్షేమే ప్రభుత్వ ధ్యేయం

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. యువతలో పఠనాసక్తి పెంపొందించేందుకు గ్రామ స్థాయిలో గ్రంథాలయాల ఏర్పాటు ఎంతో అవసరమని అన్నారు

అనంతరం గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ కావాలనే ఉద్దేశంతో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని నాయకులు కొనియాడారు

పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ట్రస్టులు మరియు సేవా సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

## గాంధీజీ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**నాంపల్లి జూన్ 20(వార్త వేదిక సూర్య):**



నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో విద్యార్థులతో ఘనంగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా యోగా ఆసనాలు, ప్రాణాయామాలు చేసి యోగా యొక్క విశిష్టతను చాటిచెప్పారు.

గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ యోగ సాధన ద్వారా రోజువారీ జీవితంలో ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యకరమైన మరియు సంతోషకరమైన జీవితాన్ని ఎలా సాగించవచ్చో తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిరోజు యోగా సాధన చేయాలని సూచించారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు శారీరకంగా దృఢంగా, మానసికంగా ప్రశాంతంగా ఉండాలంటే యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని పిలుపునిచ్చారు

ఈ సందర్భంగా విద్యార్థులు యోగా మాస్టర్ బోడ సాయిరాం ఆధ్వర్యంలో ముందుగా శరీరాన్ని సిద్ధం చేసే వార్మ్-అప్ వ్యాయామాలు నిర్వహించారు. అనంతరం తాడాసనం, వృక్షాసనం, త్రికోణాసనం, భుజంగాసనం, వజ్రాసనం, పద్మాసనం వంటి వివిధ యోగా ఆసనాలను అభ్యసించారు. అలాగే ప్రాణాయామం, అనులోమ-విలోమం, భ్రమరి వంటి శ్వాస వ్యాయామాలను చేసి యోగా యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనశైలికి యోగా ఎంతగానో దోహదపడుతుందనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు

ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్లు కర్నాటి నాగరాజు, సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్ సామల వెంకటేశ్వర్లు, ప్రైమరీ ప్రిన్సిపల్ చిలుకూరి రామేశ్వరి , ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు ఉత్సాహంగా యోగా ఆసనాలు, ప్రాణాయామాలు నిర్వహించి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : దేవరకొండ ఆర్డీవో శ్రీమతి పి. పద్మ ప్రియ

**దేవరకొండ జూన్ 20 (వార్తా వేదిక సూర్య ):-**

కొండమల్లేపల్లి మండల పరిధిలోని బిఎల్ఓ లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వచ్చే నెలలో నిర్వహించబోయే సర్ కార్యక్రమాన్ని ఏ విధంగా చేపట్టాలో బిఎల్ఓ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి మండల తహసిల్దార్ మన్నె నరేందర్ ఎలక్షన్ డిటి ప్రశాంత్ , ఆర్ ఐ శ్రీనివాస్, ఆంజనేయులు, మాస్టర్ ట్రైనర్లు కట్టెబోయిన శ్రీనివాసులు, వాసి కర్ల రమేష్, బిఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు



6 యాదాద్రి భువనగిరి GENERAL NEWS
https://epaper.vaarthavedikasurya.com

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

ఆదివారం
జూన్ 21, 2026
సంపుటి : 2 సంచిక : 32

Follow:




## మణికొండ--నెక్నాంపూర్ సమస్యలపై హైడ్రా కమిషనర్‌కు వినతి

### - విద్యుత్ సబ్‌స్టేషన్, వాటర్ లాగింగ్, పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :

హైడ్రా కమిషనర్‌తో జరిగిన సమీక్ష సమావేశంలో మణికొండ, నెక్నాంపూర్ ప్రాంతాలకు సంబంధించిన పలు ప్రజా సమస్యలను ప్రతినిధుల బృందం ప్రస్తావించింది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సర్వే నెం.31లో సుమారు 1000 చదరపు గజాల ప్రభుత్వ భూమిని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించాల్సిన అవసరాన్ని నార్సింగి విద్యుత్ శాఖ ఏఈ వి. మణికాంత కమిషనర్ కు శనివారం ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశంపై స్పందించిన హైడ్రా కమిషనర్, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఎంఆర్వో, జిల్లా కలెక్టర్‌తో చర్చించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదే విధంగా నెక్నాంపూర్, మణికొండ ప్రాంతాల్లో కొనసాగుతున్న వాటర్ లాగింగ్ సమస్యలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, పార్కుల అభివృద్ధి, ఓపెన్ స్పేస్‌ల సంరక్షణ అంశాలను కూడా ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా సర్వే నెం.44/1, 44/2లోని ప్రభుత్వ భూముల రక్షణ, శ్రీ వెంకటేశ్వర కాలనీలోని పార్కుల అభివృద్ధి, వైఎస్సార్ కాలనీలోని పార్కుల సంరక్షణ అవసరాన్ని వివరించారు. హైడ్రా ఆధ్వర్యంలో ఇప్పటికే శ్రీ వెంకటేశ్వర కాలనీ, గోల్కొండ హిల్స్ ప్రాంతాల్లోని ఓపెన్ స్పేస్‌లు, పార్కులు ప్రజల వినియోగానికి అప్పగించబడిన నేపథ్యంలో వాటి అభివృద్ధి, నిర్వహణ కోసం సంబంధిత సీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు బి. ఉపేంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహమ్మద్, ఖుర్షీద్, అతిఫ్ ఇషాక్, వసంత్, సుజాత, రూప, స్వాతి, శ్రీని, సిద్ధు, రాజు, కోటి రామ్ ప్రసాద్, శ్యామల, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి జర్నలిస్టు సంఘాల వినతి.!

నల్గొండ టౌన్ జూన్ 20 వార్తవేదిక సూర్య



ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాలపై కథనాలు రాసే విలేకరులను లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపణ..జనం సాక్షి దినపత్రిక నల్లగొండ బ్యూరో ప్రతినిధి ఒడపల్లి మధుపై నిరాధార ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్! జర్నలిస్టుల విశ్వసనీయతను దెబ్బతీసే కుట్రలను సహించబోమని హెచ్చరించిన జర్నలిస్టులు!

వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శివరాం రెడ్డి కి వినతిపత్రం...

మీడియా స్వేచ్ఛను కాపాడాలని, పాత్రికేయుల భద్రతకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి జర్నలిస్టులపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం ఆందోళనకరమన్న సంఘాల నాయకులు పాత్రికేయుల మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని స్పష్టం సానుకూలంగా స్పందించిన డీఎస్పీ శివరాం రెడ్డి వెంటనే అసత్య ప్రచారాలు చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ సీఐ ఎమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు కు ఆదేశాలు ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు.. గుండగొని జయశంకర్, గాదె రమేష్, మల్లికార్జున్ యాదవ్, యాదగిరి, సలీం, అల్లి మల్లికార్జున్, దండంపల్లి రవి, వెంకట మధు, కుషాల్, శంకర్, హరి, సుధాకర్, ఎండీ కలీమ్ ఖాన్, నవీన్, సైదులు, శివ, సూర్య, సాగర్ . ఉపేందర్రెడ్డి తదితరులు హాజరయ్యారు

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం

నల్లగొండ బ్యూరో, జూన్ 20 (వార్తా వేదిక సూర్య )



నల్లగొండ లోని రామగిరి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో 12 వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కే శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యోగా ట్రైనర్ సేవ సభ్యులు, యూత్ ఫర్ సేవ సభ్యులు స్వామి కళాశాల కామర్స్ విభాగాధిపతి డాక్టర్ కే. సాలయ్య పాల్గొన్న వారందరికి యోగ నేర్పించారు. ఈ కార్యక్రమం లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పుష్పలత, డాక్టర్ ఏ వసంత,డాక్టర్ ఏ. దయానంద్, వై. చైతన్య సుధా, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కే మంజుల, ఐక్య కోఆర్డినేటర్ కే. నరేష్, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ టి. శ్రీనివాసులు, డాక్టర్ సంధ్య, డాక్టర్ జి. అమరావతి, రామ్ రెడ్డి అజయ్ కుమార్, డాక్టర్ వై. సునీత, కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యూత్ ఫర్ సేవ సంస్థ సభ్యులు స్వామి, నాగేందర్ వారి వాలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.

# భాగ్యనగర్ వార్డ్‌లో సీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

### జలవాయు విహార్ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం

కూకట్ పల్లి, జూన్ 20 (వార్త వేదిక సూర్య) :

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీఎంసీ కమిషనర్ భాగ్యనగర్ వార్డ్-244 పరిధిలోని హెచ్ఎంటి హిల్స్, జలవాయు విహార్ కాలనీలను శనివారం ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, పారిశుధ్యం, రహదారులు, పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై స్థానిక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై విస్తృతంగా చర్చించారు. కాలనీల అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్న కమిషనర్, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సూచనలను అధికారుల సమక్షంలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**భూగర్భ డ్రైనేజీ పునరుద్ధరణకు ప్రాధాన్యం**

హెచ్ఎంటి హిల్స్ నుండి జలవాయు విహార్ వరకు ఉన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ చాలా కాలంగా సక్రమంగా పనిచేయకపోవడంతో మురుగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్, హైదరాబాద్ వాటర్ వర్క్స్ సివరేజ్ బోర్డు అధికారులు వెంటనే సర్వే నిర్వహించి డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని, అలాగే భీముని కుంట చెరువు వద్ద ఉన్న అవుట్‌లెట్‌ను విస్తరించే చర్యలు చేపట్టాలని సూచించారు.

**జలవాయు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం**

జలవాయు కాలనీలోని రోడ్ నంబర్లు 3, 4, 5 ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్న కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నివాసితులు వివరించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సర్కిల్-51 ఇంజినీరింగ్ విభాగం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు.

**స్థానికంగా పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు**

ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించే దిశగా జలవాయు విహార్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే హెచ్ఎంటి హిల్స్‌లోని చిల్డ్రన్స్ పార్క్‌లో కూడా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి యువత, వృద్ధులకు వ్యాయామ సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

**మురుగునీటి శుభ్రతకు ప్రత్యేక యంత్రం**

జలవాయు కాలనీలో తరచుగా తలెత్తుతున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం సీవరేజ్ క్లీనింగ్ మెషీన్‌ను అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్, సివరేజ్ బోర్డు అధికారులకు సూచించారు. దీంతో మురుగునీటి లైన్లలో ఏర్పడే అడ్డంకులను వేగంగా తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు**

జలవాయు విహార్ కాలనీలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికను రూపొందించాలని ట్రాఫిక్ పోలీసు శాఖకు సూచించారు. కాలనీవాసుల భద్రతతో పాటు ట్రాఫిక్ సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు**

నివాస ప్రాంతాల్లో పెరుగుతున్న అనధికార నిర్మాణాలు, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టళ్లపై కఠిన నిఘా ఉంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రణాళిక నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలనీల పార్కుల్లో రాలిపోయే ఎండు ఆకులను వ్యర్థంగా పారేయకుండా కంపోస్టింగ్ ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ విధానం ద్వారా పార్కుల నిర్వహణతో పాటు పర్యావరణ హిత చర్యలకు ఊతమిస్తుందని అధికారులు తెలిపారు.

**ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి**

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "కాలనీల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుంది. స్థానిక సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలి" అని పేర్కొన్నారు. ప్రజల సూచనలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా వార్డ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, వాటర్ బోర్డ్ ప్రతినిధులు, ట్రాఫిక్ శాఖ అధికారులు, ఆర్ డబ్ల్యూ ఏ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక వాహన తనిఖీలు

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్-17 వద్ద శనివారం ట్రాఫిక్ పోలీసులు భారీ ఎత్తున ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సీహెచ్. రాజు నేతృత్వంలో సిబ్బంది రోడ్డుపైకి దిగి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. రోడ్డు భద్రతను పటిష్టం చేయడం, ప్రమాదాల నివారణే ధ్యేయంగా సాగిన ఈ మెరుపు తనిఖీల్లో మొత్తం 61 వాహనాలపై చట్టపరమైన కేసులు నమోదు చేసి, భారీగా జరిమానాలు విధించారు. పోలీసులు జరిపిన తనిఖీల్లో అత్యధికంగా గూడ్స్ వాహనాల ఓవర్‌లోడింగ్‌పైనే కేసులు నమోదయ్యాయి. నిబంధనల వారీగా నమోదైన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. పరిమితికి మించి సరుకు రవాణా (ఓవర్‌లోడింగ్): 20 కేసులు. కళ్లు బైర్లు కమ్మేలా హై బీమ్ లైట్ల వినియోగం 17 కేసులు.కార్లకు నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్ ఫిల్మ్: 15 కేసులు. అనుమతి లేని సైరన్లు, హూటర్ల వాడకం: 05 కేసులు.స్టీరింగ్ పట్టి సెల్‌ఫోన్ డ్రైవింగ్ 04 కేసులు నమోదు అయ్యాయి. ఈ తనిఖీల్లో భాగంగా పాఠశాల విద్యార్థుల భద్రతకు పోలీసులు ప్రథమ ప్రాధాన్యత నిచ్చారు. మార్గంలో వెళ్తున్న పలు స్కూల్ బస్సులను ఆపి, డ్రైవర్లకు అక్కడికక్కడే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. దీంతో పాటు వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ సీహెచ్. రాజు మాట్లాడుతూ.. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. అనుమతి లేని సైరన్లు, బ్లాక్ ఫిల్మ్, ఎదురుగా వచ్చే వాహనదారులను ఇబ్బంది పెట్టే హై బీమ్ లైట్లను వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా గూడ్స్ వాహనాల్లో ఓవర్‌లోడింగ్ చేయడం, మద్యం సేవించి స్కూల్ బస్సులు నడపడం లాంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరిస్తామని, భవిష్యత్తులోనూ ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# రామన్నపేటలో ఆధాని సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదన రద్దు

### ప్రజా అభీష్టం మేరకు అఖిలపక్ష సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్న, కలెక్టర్ మరియు ఎంపీ, ఎమ్మెల్యేలు

నల్లగొండ టౌన్ జూన్ 20 వార్త వేదిక సూర్య



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలో ఆధాని కంపెనీ ప్రతిపాదించిన సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణంపై స్థానిక ప్రజలు గత కొంతకాలంగా తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, నేడు భువనగిరి కలెక్టర్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో కీలక సమావేశం జరిగింది. ప్రజల అభిప్రాయానికే జై కొట్టిన స్థానిక ఎమ్మెల్యే వారి అభిష్టానికే ప్రాధాన్యత ఇస్తూ కొండను డీకొట్టిన వీరన్నకలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజల అభిప్రాయాలు, రైతుల ఆందోళనలు, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాలపై ప్రభావం, వ్యవసాయ రంగానికి కలిగే నష్టం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, స్థానికుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని ఎంపి ఎమ్మెల్యే లు గట్టిగా పట్టుబట్టడంతో సిమెంట్ కంపెనీ రద్దు చేస్తూ నిర్ణయం వెల్లడించిన కలెక్టర్ ఈ నిర్ణయంతో రామన్నపేట మండల ప్రజల్లో ఆనంద వాతావరణం నెలకొందిప్రజల పక్షానే ప్రభుత్వం: నాయకులు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ బలవంతంగా అమలు చేయదని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలకే ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు

స్థానిక ప్రజల జీవనోపాధి, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణకు ఎలాంటి హాని కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయమే అత్యంత ముఖ్యమని, ప్రజల సంక్షేమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు శ్రీ వేముల వీరేశం భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి భువనగిరి ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి తుంగతుర్తి ఎమ్మెల్యే శ్రీ మందుల సామేలు జిల్లా కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు మరియు భారీ సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

నల్లగొండ బ్యూరో, జూన్ 20 (వార్తా వేదిక సూర్య )



నల్గొండ బీజేపీ కార్యాలయం లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యం లో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు చేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతిరోజూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని నాయకులు సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని, ప్రతి ఒక్కరూ యోగా సాధన ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు యోగా దినోత్సవ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పించారు.

## ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలి

### మల్లం మహేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు

నల్లగొండ బ్యూరో, జూన్ 20 (వార్తా వేదిక సూర్య )

నకిరేకల్‌లో జరిగిన డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ మాట్లాడుతూ, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని అన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులతో పాటు పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు, టైలు, బెల్టులు, షూస్ తదితర వస్తువులను నిబంధనలకు విరుద్ధంగా తమ ప్రాంగణాల్లోనే అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని విమర్శించారు. ఈ దోపిడీపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అధిక ఫీజులు వసూలు చేస్తున్న మరియు వస్తువులను బలవంతంగా విక్రయిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు నియంత్రణ కమిటీలను సమర్థవంతంగా పనిచేయించి, విద్యను అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు బొడ్డుపల్లి నరేష్, కన్నెబోయిన వీరేశం, శివ, దాసరి శంకర్, అదిమల్ల జ్యోతి బసు , ఆదిమల్ల భగత్, రామకృష్ణ పాల్గొన్నారు.




## రాజేంద్రనగర్‌కు కేటీఆర్.. శంషాబాద్‌లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

రాజేంద్రనగర్, జూన్ 20 (వార్త వేదిక సూర్య ) :

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 11:00 గంటలకు శంషాబాద్‌లోని 'జెడీ కన్వెన్షన్' వేదికగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేటీఆర్, నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై స్థానిక నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు.

## ఆటోలో మరిచిపోయిన విద్యా ధ్రువపత్రాలు..

### గంటల్లోనే గుర్తించి అప్పగించిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య) :

మనం ఏదైనా విలువైన వస్తువు పోగొట్టుకున్నప్పుడు అది తిరిగి దొరుకుతుందనే నమ్మకం చాలా మందికి ఉండదు. కానీ మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తమ అప్రమత్తత, సేవాభావంతో ఆ నమ్మకాన్ని నిజం చేశారు. జడ్చర్లకు చెందిన పి. మల్లేష్ తన సోదరీమణులతో కలిసి ప్రయాణిస్తుండగా ఆటోలో తన బ్యాగ్‌ను మరిచిపోయాడు. ఆ బ్యాగ్‌లో అతని భవిష్యత్తుకు ఎంతో కీలకమైన విద్యా ధ్రువపత్రాలు ఉండటంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. వెంటనే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆలస్యం చేయకుండా సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి, ఆటోను గుర్తించి డ్రైవర్‌ను సంప్రదించారు. కొద్ది గంటల్లోనే బ్యాగ్‌ను గుర్తించి అందులోని విలువైన ధ్రువపత్రాలను సురక్షితంగా బాధితుడికి అందజేశారు. ఈ ఘటన పోలీసుల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచింది. సమస్య ఎంత చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు అండగా నిలవడమే పోలీసుల ధ్యేయమని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు మరోసారి నిరూపించారు. సమయానికి స్పందిస్తే ఎన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనే సందేశాన్ని ఈ ఘటన అందించింది.

## నవజ్యోతి యూత్ క్లబ్‌కు నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతి

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్‌లోని నవజ్యోతి యూత్ క్లబ్ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో, ఆ స్థానంలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని క్లబ్ ప్రతినిధులు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

క్లబ్ భవనం ప్రస్తుతం శిథిలావస్థలో ఉండటంతో స్థానిక యువత, ప్రజా కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను సానుకూలంగా పరిశీలించి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ వినతిని స్వీకరించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు మంగళారం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, మాజీ వార్డు మెంబర్ సోమ శ్రీనివాస్ గుప్త, సీనియర్ నాయకులు పలుగుచెరువు మహేష్, మాజీ అధ్యక్షులు నయీమ్ భాయ్, జగదీశ్వర్ (జ్యోతి), పద్మారావు, నాగభూషణం, మురళీమోహన్, ప్రవీణ్ కుమార్, ఈదులపల్లి శ్రీకాంత్, విశాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవుడిలా స్పందించిన పోలీసులు..

### పసికందుకు ప్రాణం పోసిన డీసీపీ బృందం!

### - విధి నిర్వహణలో మానవత్వం జత కలిస్తే... పోలీసులు దేవుళ్లుగా కనిపిస్తారు అనే మాటకు ఈ ఘటన నిలువెత్తు నిదర్శనం.

రాజేంద్రనగర్, జూన్ 20 ( వార్త వేదిక సూర్య ) :

మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని మరోసారి నిరూపించిన ఘటన శంషాబాద్-ఆరాంఘర్ మార్గంలో చోటుచేసుకుంది. నియంత్రణ కోల్పోయిన కారు చెట్టును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఏడాది పసికందు ఊపిరి ఆగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆ క్షణంలో అక్కడే విధుల్లో ఉన్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ బృందం సమయస్ఫూర్తితో స్పందించి చిన్నారి ప్రాణాలను కాపాడింది. ప్రమాదాన్ని గమనించిన పోలీసులు ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా చిన్నారికి సీపీఆర్ అందించారు. వారి శీఘ్ర చర్యలతో పసికందు మళ్లీ శ్వాస తీసుకోవడం ప్రారంభించింది. అనంతరం చిన్నారిని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. పోలీసులు కేవలం చట్ట పరిరక్షకులే కాకుండా, అవసరమైన సమయంలో ప్రాణ రక్షకులుగా కూడా నిలుస్తారని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. సమయస్ఫూర్తి, సేవాభావం, మానవత్వం కలిస్తే ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ బృందం నిరూపించింది

## సీతాఫలమండి దత్తాత్రేయ స్వామి ఆలయంలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల

సికింద్రాబాద్, జూన్ 20(వార్త వేదిక సూర్య)

స్థానికుల ఫిర్యాదు మేరకు సీతాఫలమండి దత్తాత్రేయ స్వామి ఆలయం వెనుక గల్లీలో నెలకొన్న డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, మంచినీటి సరఫరా, నూతన రోడ్డు నిర్మాణ సమస్యలను పరిశీలించేందుకు మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల వివిధ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన డా. సామల హేమ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా మంచినీటి సరఫరాలో కూడా సమస్యలు ఉన్నాయని తెలిపారు. స్థానికుల సమస్యలపై స్పందించిన డా. సామల హేమ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించడంతో పాటు మంచినీటి సరఫరాను మెరుగుపరచాలని, దెబ్బతిన్న రహదారికి నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

# రైతుల గొంతు కోసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం

- కేంద్ర కోటా పేరుతో చేతులెత్తేయడం అత్యంత దారుణం
- రైతుల గోస తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టదా...
- కెసిఆర్ రైతుని రాజు లాగా చూసుకుంటే రైతులను కోస పెడుతున్నా రేవంత్ రెడ్డి
- పూటొక మాట మాట్లాడడం రేవంత్ రెడ్డి కే సాధ్యం
- మాజీమంత్రి అవసరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం, జూన్ 20, వార్త వేదిక సూర్య**

దేశానికే వెన్నుముకగా నిలిచిన తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం దారుణమైన వెన్నుపోటు పొడిచిందని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం నాడు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడారు. కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే పంటలు కొనుగోలు చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనంగా ఒక్క గింజ కూడా కొనబోమని ప్రకటించడం రైతుల అత్యంత దారుణమైన నిర్ణయమని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు రైతులు ఎన్నో కష్టాలు పడ్డారని, సాగునీరు, విద్యుత్ సమస్యలతో వ్యవసాయం కన్నీటి సేద్యంగా మారిందని గుర్తు చేశారు. రైతుల కష్టాలను గుర్తించిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని అనేక చారిత్రాత్మక కార్యక్రమాలు అమలు చేసిందన్నారు.

### కేసీఆర్ పాలనలో రైతుకు భరోసా - కాంగ్రెస్ పాలనలో నిరాశ

మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువులను పునరుద్ధరించడం, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల ద్వారా రైతుకు ఆర్థిక భరోసా కల్పించడం బీఆర్ఎస్ ప్రభుత్వ ఘనత అని తెలిపారు. రైతుబంధు కింద రూ.72 వేల కోట్లు, రుణమాఫీకి రూ.29 వేల కోట్లు, రైతుబీమాకు రూ.6,800 కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని పేర్కొన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని, దాని ఫలితంగానే తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా మారిందన్నారు.

### పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఒక మాట ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మరొక మాట

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అన్ని పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఎందుకు చేతులెత్తేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, బోనస్ కూడా ఇస్తామని ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. కేంద్రం నిర్ణయించిన పరిమితి వరకు మాత్రమే పంటలు కొనుగోలు చేస్తామని చెప్పడం రైతులను దళారుల చేతుల్లోకి నెట్టడమేనని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడకుండా బాధ్యతల నుంచి తప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. పోరాటానికి సిద్ధం అవుతున్న బీఆర్ఎస్ తెలంగాణ రైతులు పండించే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమానికి బీఆర్ఎస్ శ్రీకారం చుడుతుందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణను వ్యవసాయ విప్లవానికి కేరాఫ్ అడ్రస్ మార్చిన బీఆర్ఎస్ పాలనను ప్రజలు గుర్తుంచుకున్నారని, రైతు వ్యతిరేక విధానాలు కొనసాగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే తగిన గుణపాఠం చెబుతారని ఆయన స్పష్టం చేశారు.

### రైతు సంక్షేమ పథకాలకు మంగళం

రైతు బంధు ముఖ్యమంత్రిగా కాకముందు రైతులకు 15000 రైతుబంధు ఇస్తాం అని ముఖ్యమంత్రిగా గెలిచిన తర్వాత ఇప్పుడు రైతులకు ఒక ఎకరా రెండు ఎకరాలకు మాత్రమే ఆరువేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకున్న రేవంత్ రెడ్డి ఇక రైతు బీమా పథకాన్ని పూర్తిగా మంగళం పాడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు మరణించినప్పుడు కుటుంబం అప్పుల పాలై అనాధక మారకుండా ఉండడానికి కేసీఆర్ రైతు బీమా తీసుకొచ్చి రైతు మరణించినప్పుడు ఐదు లక్షల రూపాయలను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వడం జరిగింది. రైతు బీమా పథకాన్ని పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం మంగళం పాడింది. రైతులకు వర్షాలకు ముందు సాగు చేసుకోవడానికి రైతులకు ఎరువుల కోసం పెట్టుబడి సహాయం చేసేది ఈ ప్రభుత్వ వచ్చిన తర్వాత రైతులకు పెట్టుబడి కూడా లేకుండా పోయింది. సాగునీరు కోసం రైతులకు ఇబ్బంది కాకూడదని కెసిఆర్ కాళేశ్వరం నిర్మించి రైతులకు సాగునీరు అందించారు. ఇదే ప్రభుత్వం కాళేశ్వరం పై కుట్రలు చేసి పూర్తిగా నాశనం చేద్దామని చూశారు. కానీ అది సాధ్యం కాలేదు పదేపదే కేసీఆర్ పై కుట్రలు చేస్తూ రేవంత్ సర్కార్ కాలం గడుపుతుంది.

కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు పూర్తిగా 24 గంటల పాటు ఉచిత విద్యుత్తును అందించారు. ఈ ప్రభుత్వం రైతులకు 7 గంటల కరెంటు చాలు అనుకొని రైతులను ఇబ్బందులు పెడుతూ సాగునీరు అందించలేని పరిస్థితిలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రైతులు పండించిన ప్రతి గింజను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయాలని లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సబితా ఇంద్రారెడ్డి హెచ్చరించారు.




# గీత కార్మికుడికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(కానా) ఆర్థిక సహకారం అందజేత



**మోటకొండూరు/వార్త వేదిక సూర్య:–** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రనికి చెందిన గీత కార్మికుడు గడ్డం యాదగిరి గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి కింద పడడం జరిగింది. తనకు తీవ్ర గాయాలు కావడంతో హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఇటీవల ఇంటికి రావడం జరిగింది. ఇతనిపైనే కుటుంబం ఆధారపడి ఉన్నందున తన వృత్తి చేసే పరిస్థితి లేనందున తన ఆరోగ్యానికి చికిత్స నిమిత్తం కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ని సహకారం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగానీ జయరాములు విజ్ఞప్తి మేరకు కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ప్రతినిధి నాతి గణేష్ ద్వారా అట్టి ఆర్థిక సహకారాన్ని ఈరోజు వారి కుటుంబ సభ్యులు సమక్షంలో గీత కార్మికుడు గడ్డం యాదగిరి గౌడ్ కు కేజీ కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరాములు స్థానిక గీత సొసైటీ అధ్యక్షులు గాజుల బాలరాజు గౌడు ల ఆధ్వర్యంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జయరాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వృత్తిలో గాయపడిన మరణించిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా తాడి కార్పొరేషన్ నుండి తక్షణ సాయం నిలిపివేసిన క్రమంలో కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థ ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక సహకారం చేస్తూ భరోసా కల్పిస్తున్నందుకు కల్లు గీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరఫున గీత కార్మికుల తరఫున కుటుంబ సభ్యుల తరఫున కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంస్థకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు మార్కెట్ కమిటీ ప్రస్తుత డైరెక్టర్ తండ పాండురంగయ్య గౌడ్. సంఘం ఉపాధ్యక్షులు లోడే ఉప్పలయ్య. దూడల కొమరయ్య. తండా రాములు. గాజుల వెంకట్. వంగాల చిన్న మల్లేశా. గడ్డం జహంగీర్. దూడల శ్రీనివాస్. గడ్డం శ్రీనివాస్. గడ్డం చిన్న వెంకట్ . గడ్డం కమలమ్మ తదితరులు పాల్గొన్నారు

# జెడ్పిహెచ్ఎస్ స్కూల్ కు వెళ్ళే దారిలో సరైన రోడ్డు వేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం



**యాదగిరిగుట్ట జూన్ 20 ( వార్త వేదిక సూర్య) :** యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూలుకు వెళ్లడం కోసం సరైన రోడ్డు లేదని వెంటనే రోడ్డు నిర్మాణం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలపై సర్వేలో భాగంగా స్థానిక జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కల్లూరి మల్లేశం మాట్లాడుతూ మున్సిపల్ కేంద్రంలో ఉన్న హైస్కూల్ లో 220 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, కానీ ఆ స్కూల్ కి వెళ్ళాలంటే రాళ్ళు ఉన్న రోడ్డు దిక్కని, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రోడ్ వేయాలని డిమాండ్ చేశారు. స్కూల్లో నైట్ వాచ్మెన్ , అటెండర్ రెండు పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు బయట వర్షాలు వచ్చినప్పుడు వంటలు చేయడానికి ఇబ్బందిగా ఉన్నదని అదనంగా రేకుల షెడ్డు నిర్మాణం చేయాలని, మధ్యాహ్న భోజనంలో గుడ్డుకు ప్రభుత్వం ఐదు రూపాయలు ఇస్తున్నదని ప్రస్తుతం మార్కెట్లో ఏడు రూపాయల పైగా ఉన్నదని ఇది మధ్యాహ్న భోజన కార్మికుల పైన భారం పడుతున్నదని అదేవిధంగా మధ్యాహ్న భోజన విద్యార్థుల మెనూ చార్జీలను 14 రూపాయల 17 పైసల నుండి 30 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సర్వే కార్యక్రమంలో సిపిఎం నాయకులు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎస్కే షరీఫ్, సిపిఎం పట్టణ నాయకులు ఈశ్వర్ రెడ్డి, సీస శ్రీను , నల్ల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు దూడ మృతి



**మోటకొండూర్/వార్త వేధిక సూర్య :–** మోటకొండూరు మండలంలోని తేర్యాలలో కనుకునూరు రమేష్ కు చెందిన ఆవు దూడ పిడుగుపాటుకు మృతి చెందింది దూడ విలువ సుమారు 40 వేల రూపాయల వరకు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని రమేష్ కోరారు.

# ఘనంగా సింగారంలో సర్వేయర్ ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఆలేరు నియోజవర్గ/వార్త వేధిక సూర్య :–**యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూరు (ఎం) మండలంలోని సింగారం గ్రామంలో సర్వేయర్ ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం 4వ వార్డు సభ్యురాలు దాసరి రేణుకా మరియు టౌన్ ప్రెసిడెంట్ చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో రాంపల్లి స్వామి, దాసరి కృష్ణ, మల్లెం శ్రీనివాస్, బెల్లం బన్నీ, పంగరెక్క స్వామి, దాసరి స్వాతి, మాజీ సర్పంచ్ భిక్షపతి, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేయర్ ప్రభాకర్ రెడ్డి సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అభిమానులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా సాధికారతపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం విజయవంతం



**ఆలేరు నియోజవర్గం/ వార్త వేదిక సూర్య:–** ఆత్మకూరు మండలంలోని సర్వేపల్లి, రాయిపల్లి, తిమ్మాపూర్ గ్రామాల మహిళా సంఘ సభ్యులకు మహిళా సాధికారతపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. బోస్కో సేవా కేంద్రం వారి ప్రాజెక్టులో భాగంగా నీడ్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గ్రామీణ మహిళలకు స్వయం సాధికారత, ఆర్థిక స్వావలంబన, నాయకత్వ లక్షణాలు, చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం. కార్యక్రమంలో మూడు గ్రామాల నుండి సుమారు 40 మంది మహిళా సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్లు మహిళలకు స్వయం సహాయక సంఘాల నిర్వహణ, బ్యాంకు లింకేజీ, చిన్న వ్యాపారాలు ప్రారంభించే విధానాలు, గృహ హింస నిరోధక చట్టం, మహిళా హెల్ప్‌లైన్ 181 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నీడ్ ఎన్జీవో డైరెక్టర్ కె. శ్రీశైలం మాట్లాడుతూ, "బోస్కో సేవా కేంద్రం సహకారంతో మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తాం. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నదే మా లక్ష్యం" అని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు తమ అనుభ వాలను పంచుకుంటూ, ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, తమ గ్రామాల్లో ఇతర మహిళలకు కూడా అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో, ఆత్మకూర్ మండలం ఎంపీడీవో రాముడు నాయక్ , వి లీడ్ ప్రాజెక్టు రీజనల్ కోఆర్డినేటర్ ఎస్. అంబేద్కర్, స్టేట్ కోఆర్డినేటర్ ఏ. శిరీష, సర్వేపల్లి గ్రామ సర్పంచి కే ఉపేందర్ రెడ్డి. జ్యోతి, పార్వతమ్మ స్థానిక నాయకులు, , నీడ్ ఎన్జీవో సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు

- పాఠశాల చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి
- మానస విద్యామందిర్‌లో ఘనంగా యోగా దినోత్సవం



**మోటకొండూరు /వార్త వేధిక సూర్య :–** నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని పాఠశాల చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం మానస విద్యామందిర్ (బి.ఎం.ఆర్.ఎస్) పాఠశాలలో ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు పలు రకాల యోగాసనాలు వేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే యోగా సాధన చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని, ఒత్తిడి దూరమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం కాసేపు యోగాసనాలు వేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఈటి శ్రీలత, నవనీత, హనీఫ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# గనగాని మాధవి మల్లేశం గౌడ్‌కు అంతర్జాతీయ జర్మనీ పీస్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మక డాక్టరేట్




**ఆత్మకూరు (ఎం), జూన్ 20, (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్, ప్రముఖ సామాజిక కార్యకర్త, గనగాని ఫౌండేషన్ చైర్మన్ గనగాని మాధవి మల్లేశం గౌడ్ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. సమాజానికి ఆమె చేసిన విశేష సేవలను గుర్తిస్తూ, జర్మనీకి చెందిన ప్రతిష్టాత్మక పీస్ యూనివర్సిటీ ఆమెకు డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ పట్టాను ప్రకటించింది. తమిళనాడు రాష్ట్రంలోని ఊటీ (కోయంబత్తూర్) పట్టణంలో గల 'జెమ్ పార్క్' హోటల్‌లో శనివారం ఘనంగా నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఈ అవార్డును పీస్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. చల్లాద్రి, డాక్టర్ ఎ. ప్రమోద్ రాజేందర్, యూఎన్ సౌత్ ఇండియా చీఫ్ డైరెక్టర్ డాక్టర్ డి. లక్ష్మీకాంతం, డైరెక్టర్ గొల్లపూడి వెంకటరత్నం ల చేతుల మీదుగా గనగాని మాధవి మల్లేశం గౌడ్ ఈ గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గ్రామీణ ప్రాంతం నుండి నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, గనగాని ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాధవి మల్లేశం గౌడ్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల పోతిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు, ఆత్మకూరు మండల ప్రముఖులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
ఆదివారం జూన్ 21, 2026
సంపుటి : 2, సంచిక : 32
Follow:




# శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారిని దర్శించుకున్న మంత్రి సీతక్క





**యాదగిరిగుట్ట జూన్ 20 (వార్త వేదిక సూర్య) :** తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ధనసరి అనసూయ సీతక్క, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన సీతక్కకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్వాగతం పలికారు. మంత్రికి ఆలయ సాంప్రదాయ ప్రకారం ఆలయ అర్చకులు పూర్ణకుంభం తో స్వాగతం పలికారు. అనంతరంగర్భగుడిలో స్వయంభు నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్ర చార్యుల ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా ఆలయ చైర్మన్ స్వామివారి లడ్డు, ప్రసాదం, శేష స్వామి వారి ఫోటోను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యులు, మురళి కుమార్ చార్యులు, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసిల్దార్ గణేష్ నాయక్, బండ్రు శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, కౌన్సిలర్లు బూడిద మధు, గౌలికర్ రాజేష్, గుండ్లపల్లి రాము, అజయ్ తదితరులు ఉన్నారు.

# ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

**- ఎంఈఓ కార్యాలయంలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు ఒగ్గు మల్లేష్ వినతి పత్రం**



**యాదగిరిగుట్ట జూన్ 20 (వార్త వేదిక సూర్య) :** ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని యాదగిరిగుట్ట ఎంఈఓ కార్యాలయంలో బిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు ఓగ్గు మల్లేష్ వినతి పత్రం సమర్పించారు. విద్యా హక్కు చట్టం అమలు చేయడంతో పాటు అనుమతులు లేని విద్యా సంస్థలను మూసివేయాలని వినతి పత్రం లో పేర్కొన్నారు. అంతేకాకుండా పాఠశాలలో స్టేషనరీ వ్యాపారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. బిఆర్ఎస్వి నాయకులు దర్శనం విజయ్ కుమార్, కర్రె చంద్రశేఖర్, మోటే శేఖర్, ఆతుకూరి ఐలేష్, కాదూరి కరుణాకర్, గోపి వంశి, మోటే సురేష్, కర్రె మల్లేష్ , తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా 488 కేసులు పరిష్కారం కక్షిదారుల ఒప్పందంతో వివాదాలకు ముగింపు





**రామన్నపేట ,జూన్ 20 (వార్తా వేదిక సూర్య ) :** రామన్నపేట జ్యూరిస్డిక్షన్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 488 కేసులు పరిష్కారం పొందాయి. రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి. సత్తయ్య సంయుక్తంగా కోర్టు హాళ్లలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 2 సివిల్ కేసులు, 97 క్రిమినల్ కేసులు రాజీ ద్వారా పరిష్కరించబడ్డాయి. అదేవిధంగా బ్యాంకు, ప్రీ–లిటిగేషన్ ఇతర పిట్టి కేసులు కూడా కక్షిదారుల పరస్పర అంగీకారంతో పరిష్కారం పొందాయి. పిట్టి కేసులలో రామన్నపేట కోర్టు జ్యూరిస్డిక్షన్‌లో 378 కేసులు పరిష్కరించబడినట్లు న్యాయమూర్తులు తెలిపారు. రామన్నపేట జ్యూరిస్డిక్షన్‌కు సంబంధించిన రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగూడూరు సంబంధించిన పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ రకాల కేసులను లోక్ అదాలత్ ద్వారా వేగవంతంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించడం జరిగిందన్నారు. అలాగే బ్యాంకు ప్రీ–లిటిగేషన్ కేసుల ద్వారా మొత్తం రూ. 6,54,583/- వసూలు చేయబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ, క్షణిక ఆవేశాలు లేదా పరిస్థితుల ప్రభావంతో ఏర్పడిన వివాదాలపై దీర్ఘకాలిక న్యాయపోరాటాలకు వెళ్లడం కంటే, లోక్ అదాలత్ అనే రాజీమార్గాన్ని వినియోగించుకుని పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమమని పేర్కొన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోకుండా ప్రజలు లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్లు, వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, కోర్టు సిబ్బంది, సంబంధిత అధికారులు ఇతరులు పాల్గొన్నారు.

# మెరిసిన మరో ఆణిముత్యం

**- బాసర ట్రిపుల్ ఐటీకి మోటకొండూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి 'చింతల భరద్వాజ్' ఎంపిక**





**మోటకొండూరు/జూన్ 20 (వార్త వేధిక సూర్య):–** మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరోమారు తన ప్రతిభను చాటుకుంది. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థి చింతల భరద్వాజ్ ప్రతిష్టాత్మక 'రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్' బాసర ట్రిపుల్ ఐటీ లో సీటు సాధించినట్లు మండల విద్యాధికారి, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కేతిరెడ్డి రఘురాం రెడ్డి శనివారం అత్యంత హర్షంతో వెల్లడించారు.

**ప్రభుత్వ బడుల విజయకేతనం**

**ఎంఈఓ రఘురాం రెడ్డి**

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యంత నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని అనడానికి మన విద్యార్థుల విజయాలే నిదర్శనమన్నారు. ఈ విద్యాసంవత్సరంలో తమ పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి పది మంది విద్యార్థులు పాలిసెట్‌కు మరియు పదిహేను మంది విద్యార్థులు వివిధ గురుకుల పాఠశాలలకు ఎంపికై రికార్డు సృష్టించారని గర్వంగా తెలిపారు. గ్రామంలోని విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరి తమ ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

**100 అడ్మిషన్ల లక్ష్యం విద్యార్థులకు శుభాకాంక్షలు**

పాఠశాల సాధిస్తున్న విజయాల వల్ల ఈ విద్యాసంవత్సరం నూతన అడ్మిషన్లు ఇప్పటివరకు 50 దాటాయని, ఈసారి 100 అడ్మిషన్లు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఉపాధ్యాయ బృందం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

# పర్యావరణ పరిరక్షణ విద్యార్థుల సామాజిక బాద్యత

**- మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశమ్**

**రామన్నపేట ( వార్త వేదిక సూర్య )జూన్ 20**

రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) వ్యవస్థాపక అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మునిపంపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం, సీజీఆర్ ప్రతినిధి దామెర ఉదయ్ కుమార్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమని అన్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న పురాతన చెట్లను గుర్తించి వాటిని "మాతృవృక్షాలు"గా పరిరక్షించాలని విద్యార్థులకు సూచించారు. ఈ చెట్లు పర్యావరణ సమతుల్యతకు, జీవ వైవిధ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సీజీఆర్ ప్రతినిధి దామెర ఉదయ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి,ఉపాధ్యాయులు త్రివేణి కుమార్ , గంటెపాక శివ కుమార్, బూడిద యశ్వంత్,విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.






# యాదాద్రి దివ్య క్షేత్రంని సందర్శించిన ఎంపీ వద్దిరాజు



**యాదగిరిగుట్ట జూన్ 20 (వార్త వేదిక సూర్య) :** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, తన కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని, సన్నిహితులు మోహన్ యశ్వంత్ పాటిల్, సుమిత అరుణ్ సింగ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శనివారం ఉదయం యాదాద్రి దివ్య క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు శ్రీలక్ష్మీనర్సింహా స్వామిని దర్శించుకుని తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ రవిచంద్రతో కలిసి ఆలయానికి విచ్చేసిన వారికి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మేళ తాళాలతో సాదర స్వాగతం పలికారు. ఎంపీ వద్దిరాజు, మోహన్ యశ్వంత్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డిలకు వేద పండితులు పూలమాలలు వేసి, కండువాలతో సత్కరించి, శ్రీలక్ష్మీ నరసింహాస్వామి తీర్థప్రసాదాలు ఇచ్చి వేద ఆశీర్వచనాలు పలికారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**